అడ్డం తిరగని కథ!

ఎ.యస్. రావ్

సిగరెట్ పీకని గిరాటేసి, చెట్టుకి జార్లా బడ్డాడతను. సావధానంగా మరో సిగరెట్ వెలిగించాడు.

అతని చూపులు ఆ ఇంటిగేటుమీదే నాటుకుపోయి వున్నాయి. మూడునిమిషాల క్రితమే అతను స్కూటర్ మీద వెళ్ళిపోయి వుండాలి. ఇవాళ ఎందుకో ఆలస్యం చేస్తున్నాడతను. ఇంతకీ ఇవాళ అతను ఇల్లొదిలి ఆఫీసుకి వెళ్తాడా?

అతని ప్రశ్నకి సమాధానం చెప్తున్నట్టు వందగజాల దూరంలో వున్న గేటుగుండా చప్పుడు చేస్తూ బజాజ్ కబ్ ఇవతలికి దూకింది. నల్ల కళ్ళద్దాలు. పెదాలమధ్య ఇరుక్కున్న సిగరెట్. స్కూటర్ కుడివేపుకి తిరిగి వేగం పుంజుకుంది.

వీపుని చెట్టుబోదెకి దూరంగా జరిపాడతను. వేగంగా దూసుకెళ్తున్న స్కూటర్ని చూస్తూ కాసేపు అలాగే చెట్టు పక్కన కట్రాటలా నిలిచిపోయాడతను. స్కూటర్ మరో

మలుపు తిరిగింది. అతను పక్కకి తిరిగాడు. చకచకా అడుగులేస్తూ గేటుని సమీపించాడు. అతని చూపులు వరండా వైపు దూసుకెళ్ళాయి. భర్త వీపుమీదే, లేకపోతే మొహంమీదే తలుపుల్ని మూసేసినట్టుందామె.

నవ్వుకుంటూ సిగరెట్ పీకని గిరాటేసి వరండా వేపు కదిలాడతను. రెండు క్షణాల్లో అతని చూపుడు వేలు కత్తిలా కాలింగ్ బెల్ స్విచ్చిమీదున్న గంటని గుచ్చింది. చేతినిలాగి, నిటారుగా ఠీవిగా నిలబడ్డాడతను. తలుపు తటాలున లోపలికి జరిగింది.

"ఇవాళ ఏమిటి మరిచిపోయారు?" ప్రశ్నని వరండా మీదికి రువ్వి, తలని ఇవతలికి చాపిన ఆమె కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి.

"ఎవరు?" అందామె.

పొట్టిగా, లావుగా వున్న ఆమె గుండ్రటి మొహంలోకి అతను చిరునవ్వుతో చూశాడు. చూడీదార్, కమీజ్.

"గంగాప్రసాద్ గారున్నారా?" బజాజ్ మీద పరుగుతీసిన గంగాప్రసాద్‌ని తలుచుకుంటూ ఆగాడతను.

"లేరు ఆఫీసుకెళ్ళారు. మీరు....?"

"పేరు రుద్రభట్. రైటర్ గార్ని ఇంటర్వ్యూ చేయడానికి వచ్చాను...." అతను ఆగాడు.

"మీది యే పత్రిక?" ఆమె వెంటనే ప్రశ్నించింది ఫుల్ సూటులో వున్న అతన్ని పరిశీలనగా చూస్తూ.

అతను చిన్నగా నవ్వాడు. "మిసెస్ ప్రసాద్.... మీకు అభ్యంతరం లేకపోతే, లోపలికెళ్ళి మాట్లాడుకుందాం...."

ఆమె తటపటాయిస్తూ చూసింది. అతను చిరునవ్వు

నవ్వాడు.

"రావాలంటే మీరు తలుపు బార్లా తెరిచివుంచారు. రచయిత భార్యగా మిమ్మల్ని ఇంటర్వ్యూ చేయాలి నేను!"

ఏదో అనుమానం, యేదో ఆశా ఆమె మొహంమీద రోజ్ కలర్, పౌడర్ కోటింగ్‌లా ప్రత్యక్షమయ్యాయి. చిరునవ్వుతో మెరుస్తున్న అతని పళ్ళనీ, కళ్ళనీ ఒకసారి చూసిందామె. ఆమె ఎడమచెయ్యి అప్రయత్నంగా తలుపుని బార్లాతోసింది.

"రండి...." అంటూ ఆమె వెనక్కి తిరిగింది.

అతను ఆమెని వెంబడించాడు. చిన్న హాలు. గోడ వారగా వున్న సోఫాని అతనికి చూపిస్తూ ఆమె కదిలింది. అతను సోఫాలో కూచుని, గదిలోకి వెళుతున్న ఆమెనే రెప్పవేయకుండా చూస్తూండిపోయాడు. వయసుకి మించిన లావుతో ఆమె బుట్టబొమ్మలా వుంది. ఆమె కళ్ళనీ, శరీరాన్నీ గుర్తుచేసుకుంటూ ఆమె తత్వాన్ని తేరిజా వేయడానికి ప్రయత్నిస్తూ అతను సోఫాలో వెనక్కి వాలాడు.

మెత్తటి అడుగుల చప్పుడు అతని ఆలోచనల్ని చెల్లా చెదురు చేసింది. తన ఎదురుగా ప్రత్యక్షమైన ఆమెని రుద్రభట్ చిరునవ్వుతో చూశాడు. ఆకుపచ్చరంగు పువ్వులున్న టర్కిష్ టవల్ని ఆమె ఛాతీమీద వల్లెవాటులా వేసుకుందిప్పుడు. దిష్టి తగలకుండా నా? రుద్రభట్ నవ్వు ఆపుకుంటూ ఆమెకి తెల్లటి పళ్ళు చూపించాడు. యెదురుగా వున్న సోఫాలో బరువుగా కూచుంటూ ఆమె చిరునవ్వు నవ్వింది.

"చెప్పండి...."

"మిసెస్ ప్రసాద్ ...." రుద్రభట్ ప్రారంభించాడు.

"నా పేరు సునీల ...." ఆమె అడ్డు తగిలింది.

"ఓహ్....అయామ్ సారీ....అండ్ అయామ్ హాపీటు నో యూ మిసెస్ సునీలా....మీ పేరు కొత్తగా, చక్కగా వుంది. సునీలా ఈజే నైస్ నేమ్...."

"థాంక్స్."

"నేను 'భారసం' సంస్థ యాక్టివ్ ప్రెసిడెంట్‌ని."

"భారసమా?" సునీల కనుబొమలు వంకీలు తిరిగాయి "అంటే ఏమిటి? కొత్త పత్రికా?"

రుద్రభట్ చిన్నగా నవ్వాడు. "నో. పత్రిక కాదు. భా-ర-సం అంటే భారత రచయితల సంక్షేమ సమాఖ్య. మూడేళ్ళక్రితం ఇది ఢిల్లీలో జన్మించింది. కొంతకాలం రచయితగా రాణించిన నేను ఇలాంటి సంస్థ అవసరాన్ని గుర్తించాను. భారసాన్ని స్థాపించాను; ఒంటరిగా. తరవాత, అచిరకాలంలో పి.ఇ.ఎన్, రైటర్స్‌గిల్డు, రాష్ట్రాల రచయితల సంఘాలూ 'భారసం'తో ఎడతెగని సంబంధాలు పెట్టుకున్నాయి. భారసం పరిధీ, బాధ్యతా విస్తరించాయి. జ్ఞానపీఠ్ అవార్డు పొందినవాళ్ళూ, రాష్ట్రస్థాయి బహుమతులు పొందిన రచయితలూ, సాహిత్య అకాడెమీ — కేంద్రం — రాష్ట్రాలూ కూడా-భారసంలో సలహా సభ్యులుగా, కార్యదర్శులుగా కృషి చేస్తున్నారు. భారసం యాక్టివిటీస్ కందదాకా వున్నాయి. అవన్నీ మనకి ఇప్పుడు అనవసరం...." రుద్రభట్ ఆగి ఆమెవైపు చిరునవ్వుతో చూశాడు.

"గంగాప్రసాద్‌గారు స్మోక్ చేస్తారనుకుంటాను. నేను సిగరెట్ కాలిస్తే ఫర్లేదుగా?"

సునీల చిన్నగా నవ్వింది. "కాల్చుకోండి. రాతలో

మునిగిపోతే ఆయన గది కట్టెల పొయ్యి వుండే వంట గదిలా తయారవుతుంది!"

రుద్రభట్ పకపక నవ్వాడు. సిగరెట్ ముట్టించి ఆమెని నవ్వుతూ చూశాడు. "సునీలగారూ, మీరూ రాస్తారా?"

"ఏం?"

"మీలో చక్కటి భావనాశక్తి వుంది. ఇందాకా మీ ఆయన సిగరెట్స్ ఎక్కువగా కాలుస్తారని డైరెక్టుగా చెప్పకుండా వంటగది ఉపమానంతో అద్భుతంగా చెప్పారు. ఇంతవరకూ రాయకపోతే వెంటనే కాగితాలూ, కలం అందుకోండి!"

సునీల సిగ్గుపడుతూ నవ్వింది. "నేనెక్కడ రాస్తాలెండి! ఆయనకి ఇతివృత్తాలు ఊహించడంతోటే సరిపోతోంది! ఇంతకీ మీరు వచ్చిన పని...."

"యస్! చెప్తాను: ఎన్నో కార్యక్రమాల్ని ప్రారంభించిన 'భారసం' రచయితల సంక్షేమాల్ని ప్రముఖంగా ఆలోచిస్తోంది. ప్రచురణకర్తలనుండీ న్యాయంగా రావాల్సిన పారితోషికం, రావాల్సిన కాంప్లిమెంటరీ కాపీలు వగైరాల్ని సక్రమంగా రాబట్టడంలో రచయితలకి సహాయం చేస్తుంది. ఇందుకోసం రచయితలు పైసా ఇవ్వక్కర్లేదు...."

"అలాగా?" చందా, సభ్యత్వరుసుం వగైరా వాటికి రుద్రభట్ గాలం వదుల్తున్నాడేమో అని చిటికెలో ఊహించడం ప్రారంభించిన సునీల వెంటనే అంది.

"మరేమనుకున్నారు? కేంద్ర సాహిత్య అకాడెమీ సిఫార్సు మేరకు ప్రభుత్వం 'భారసం'కి గ్రాంట్స్ మంజూరు చేసింది! అదలా వుంచండి. పారితోషికం,

పుస్తకాల ప్రతులూ—ఇవేకాకుండా రచయితలకి సంబంధించిన మరో ముఖ్యమైన — నన్నడిగితే — అసలైన విషయం గురించి 'భారసం' ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. అది...."

"ఏమిటది?" రుద్రభట్ మాటల్లో ఇంటరెస్ట్ పుట్టిన సునీల తటాలున ప్రశ్నించింది.

"ఈమధ్యన రచయితల పారితోషికం రేటు కూడా మనదేశంలో గణనీయంగా పెరిగింది. తమ టాలెంట్ ద్వారా సంపాదిస్తున్న పైకాన్ని రచయితలు సద్వినియోగం చేస్తున్నారా, దుర్వినియోగం చేస్తున్నారా అన్న విషయాన్ని పరిశీలించి దుర్వినియోగం జరిగే సందర్భాల్లో భారసం చొరవతీసుకుని, పరిస్థితిని చక్కబెట్టే ప్రయత్నం చేస్తుంది...."

"అంటే?" సునీల కనుబొమలు ముడేస్తూ ప్రశ్నించింది.

"ఉదాహరణకి మీ ఆయన సంగతి తీసుకుందాం. ఉద్యోగరీత్యా ఆయనకి నెలకి రెండువేలా రెండువందల నలభైరూపాయల మొత్తం—కటింగ్స్ పోనూ వస్తోంది."

"మీకెలా తెలుసు?" భర్త జీతాన్ని ఖచ్చితంగా చెప్తున్న రుద్రభట్ ని పెద్దవైన కళ్ళతో చూస్తూ సునీల ఆశ్చర్యంతో ప్రశ్నించింది.

రుద్రభట్ సగర్వంగా నవ్వాడు. "ఇండియాలోని అన్ని భాషల రచయితల, రచయిత్రుల కథలన్నీ సమగ్రమైన నరలల్లాగా మాకు—అంటే, 'భారసం'కి తెలుసు! అవన్నీ తెలుసుకోడానికి మా పద్ధతులు మాకున్నాయిలెండి. తరవాత....గంగాప్రసాద్ గారి నెలసరి ఆదాయం అంత వుంది. రచనల ద్వారా వచ్చే ఆదాయం లేక

పోయినా అయినా, ఆయన కుటుంబం హాయిగా జీవించే అవకాశం వుంది. అంచేత అదనంగా వచ్చే ఆదాయాన్ని ఆయన మరో మంచి పనికి ఉపయోగించాలి. అంటే— మాటవరసకి యేదో నవల ఆయనకి ఏ పదివేలో ఆర్జించి పెట్టిందనుకుందాం. ఆ పదివేలనీ ఒక బంగారం గొలుసుగా మార్చి ఆయన మీ మెడలో అలంకరించవచ్చు!" రుద్రభట్ ఆగి నవ్వుతూ చూశాడు.

సునీల కళ్ళు యెందుకో మెరుస్తున్నాయి. అప్రయత్నంగా ఆమె తలాడించింది.

"సో, మాటవరసకే—మీ ఆయన ఆ పదివేలనీ మీ మెడలో వేయకుండా యే గుర్రప్పందాలమీదో తాగుడు కిందో తగలేశాడనుకుందాం. అప్పుడు ఆయన్ని తగు విధంగా ఎజుకేట్ చేయడానికి ప్రయత్నిస్తాం. ఆ కార్యాన్ని మీ ద్వారా—మీరు ఆయన జీవిత భాగస్వామి కనక—కొనసాగిస్తాం!" రుద్రభట్ ఆగి, లేచి కిటికీవైపు నడిచాడు. సిగరెట్ పీకని ఇవతలికి విసిరి, ఆమెవైపు తిరిగాడు. అర్థంకాని ఉద్రేకంతో ఆమె అతన్నే చూస్తోంది. రుద్రభట్ నవ్వుతూ సోఫావైపు నడిచాడు. కూచుని ఆమెని సూటిగా చూశాడు.

"మిసెస్ సునీలా, మిమ్మల్నీ, మీ ఆయన్నీ ఇంటర్వ్యూ చేయడానికి వచ్చానన్నాను. ఎందుకో మీరు అడగలేదు!"

"ఔ....ను...." సునీల సందేహిస్తూ అంది.

"మా సంస్థ సేకరించిన సమాచారం ప్రకారం గత దీపావళి సందర్భంలో మీ ఆయన రాసిన నవల 'గాలిలో ఈత'కి పదివేల రూపాయల ప్రథమ బహుమతి వచ్చింది. అత్యధికంగా అమ్ముడై పోతున్న ఒకానొక వారపత్రిక

ఆ నవలని ధారావాహికంగా ప్రచురించింది. ఆ పదివేల రూపాయలూ మీ మెడలో వాలలేదని కూడా మాకు తెలుసు!" రుద్రభట్ ఆగి, ఆమె వైపు నవ్వుతూ చూశాడు.

సునీల సోఫాలో వెనక్కి వాలింది. "మీకు... ఇంకా ఏం తెలుసు?" అప్రయత్నంగా ప్రశ్నించిందామె.

"మీ ఆయనకి గుర్రప్పందాల పిచ్చి లేదని తెలుసు. ఆయనకి తాగుడు అలవాటు లేదని తెలుసు. పేకాట లాంటి జూదాలు అలవాటు లేదని తెలుసు. మీరు తప్ప మరో స్త్రీకి ఆయన హృదయంలో స్థానం లేదని తెలుసు. అయితే ఆ పదివేలూ ఏమయ్యాయి? ఇదే మాకు తెలీదు!" రుద్రభట్ నవ్వుతూ అడిగాడు.

సునీల అతన్ని కాసేపు మౌనంగా చూస్తూ వుండి పోయింది. మెల్లిగా ఆమె లిప్‌స్టిక్ పెదవులు కదిలాయి "తెలీని ఇలాంటి విషయాల గురించి మీ సంస్థ ఎందుకింత తాపత్రయపడుతోంది?"

తన ఉపోద్ఘాతాన్ని అప్పుడే మరిచిపోయిన ఆమెని రుద్రభట్ సానుభూతితో చూశాడు. "ఒకే ఒక ముక్కలో మీ సందేహానికి సమాధానం చెప్తాను: మీ భర్తలాంటి రచయితలు పాఠకుల్ని, సమాజాన్ని ఎడ్యుకేట్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. సంస్థ తరఫున నేను రచయితల్ని ఎడ్యుకేట్ చేయడానికి ప్రయత్నిస్తున్నాను!"

సునీల చిన్నగా నిట్టూర్చింది. "మీరు సాయంత్రం రండి. ఆయనతో మాట్లాడండి. ఎందుకంటే మీరు అడగబోయే ప్రశ్నలకి నేను సమాధానాలు చెప్పలేను."

"చెప్పగలరు!" రుద్రభట్ బల్లగుద్దినట్టు అన్నాడు.

"అలా ఎందుకనుకుంటారు?"

"అనుకోడంకాదు; అంటున్నాను!" రుద్రభట్ సగర్వంగా అన్నాడు. "ఎందుకంటే, మీలాంటి చదువుకున్న స్త్రీలు, రచయితల భర్తలకి—ప్లాట్లు అందించే-కలం పట్టని రచయిత్రులు—నిజం చెప్పడానికి వెనకాడరు!"

సునీల అర్థంకానట్టు చూసింది. ఆమె నోరు పెగుల్చుకునేలోగా రుద్రభట్ ప్రారంభించాడు.

"సునీలగారూ, ఇందాకా, ఆ పదివేలూ యేమయ్యాయో తెలీదని ఊరికే అన్నాను. ఆ పదివేలూ యేమయ్యాయో నాకు తెలుసు. మీకూ తెలుసని నాకు తెలుసు...."

"ఏమయ్యాయి?" సునీల సవాలు రువ్వినట్టు అంది.

రుద్రభట్ చిన్నగా నవ్వాడు. "మిసెస్ సునీలా, ఆ పదివేలూ మీకు అంటే, మీ ఆయన చేతికి రాలేదు!"

సునీల ఉలిక్కిపడింది. "మీరు.... మీకు...."

"కంగారుపడకండి!" రుద్రభట్ చిన్నగా నవ్వుతూ అన్నాడు. "రచయితల్ని గురించి పరిశోధించినట్టే, మా సంస్థకోసం దేశంలోని పత్రికల్నీ, ప్రచురణ సంస్థల్నీ నేను క్షుణ్ణంగా పరిశోధించాను. ఆ పదివేలూ వదులుకోడంవల్లనే మీ ఆయన నవలకి ప్రథమ బహుమతి వచ్చింది! వదులుకోడంవల్లే అది సీరియల్ అయ్యింది!"

సునీల నివ్వెరపోతూ చూసింది. రుద్రభట్ చిరునవ్వు నవ్వుతూ ఆమెకి ధైర్యం చెప్తున్నట్టు చూశాడు.

"ఆ షరతుకి అంగీకరించకపోయివుంటే మరో రచయిత రాసిన మరో నవలకి,—ఏ 'నేలమీద ఈత'కో

ఆ బహుమతి వచ్చి వుండేది!"

"ఇదంతా మీ కెవరు చెప్పారు?" సునీల వణికే కంఠంతో ప్రశ్నించింది.

"ఆ విషయం మరిచిపొండి!" రుద్రభట్ నవ్వాడు.

"మీకో సంగతి చెప్తాను. అమెరికాలో ప్రెస్ సిండికేట్స్ వున్నాయి. వాటి ద్వారా వస్తేకానీ, యే రచయిత నవలనీ, కథనీ—ఎవరూ ప్రచురించరు. యేజెంట్ లా వ్యవహరించే ప్రెస్ సిండికేట్ సిఫార్స్ చేస్తేగానీ రచనలు పరిశీలించబడవు. పరిశీలన జరిగి ప్రచురించబడ్డాక రచయితకి వచ్చే పారితోషికంలో నాలుగు శాతం సిండికేట్ తీసుకుంటుంది. సిండికేట్ మూలంగా అక్కడ రచయితలకి యెంతో మేలు జరుగుతోంది. పారితోషికం గల్లంతుకాదు. ఆ వ్యవస్థ ఇక్కడ లేదు. పూర్తిగా ప్రచురణ కర్త దయా-ధర్మాలమీద రచయిత ఆధారపడి వున్నాడు. అంచేత 'భారసం' చొరవ తీసుకుంటుంది...."

"ఎలా?"

"మీ ఆయన సంగతే తీసుకోండి. పారితోషికానికి పావలా నువ్వులు వదిలేసి ఆయన నవలని ఇచ్చేసుకున్నారు. పత్రిక అచ్చేసుకుంది. ఆయన అలా చేయడానికి కారణం మీకు తెలుసు. ఆయన అంగీకరిస్తే, అసలు సంగతిని రాతమూలకంగా, రహస్యంగా మాకు అందజేస్తే 'భారసం' తగిన చర్య తీసుకుంటుంది. మీ ఆయన పరువూ, పత్రిక పరువూ పాడవకుండా మధ్యే మార్గంలో వ్యవహారం నడిపి, గుట్టుచప్పుడు కాకుండా పది వేల పారితోషికాన్ని ఇప్పిస్తుంది. అందుకు ప్రతిఫలంగా రెండు శాతం అంటే కేవలం రెండువందలు స్వీక

టుంది. అంతే!" రుద్రభట్ నవ్వుతూ అన్నాడు.

సునీల మౌనంగా వుండిపోయింది. ఆమె కళ్ళల్లో యేదో ఆశా, యేదో అనుమానం దోబూచులాడు తున్నాయి.

"జరిగిందాన్ని బైట పెడితే ఆ పత్రిక భవిష్యత్తులో మీవారి రచనల్ని వేసుకుంటుందో, లేదో అని మీరు ఆలోచిస్తున్నారు. అగ్రిమెంట్ సీరియల్ అయిపోయాక మీవారు రాసి పంపిన రెండో నవలని ఆ పత్రిక తిప్పి పంపిందనీ మాకు తెలుసు!" రుద్రభట్ నవ్వుతూ అన్నాడు.

సునీల ఆశ్చర్యాన్ని ఆమె పెద్ద కళ్ళు చక్కగా వ్యక్తం చేశాయి. "అయితే.... మీకు...."

"అంతా తెలుసని ఇందాకే చెప్పాను. ఈ సందర్భంలో మీకో సత్యం చెప్తాను. రచన ఆధారంతో కాకుండా మరో ఆధారంతో రచయితగా పరిచయం అయిన వ్యక్తి ఆట్టేకాలం నిలబడ్డం జరగదు. మీవారి నవలని ఆ పత్రిక బ్రహ్మాండంగా పైకెత్తేసి, హైక్లాస్ పబ్లిసిటీ ఇచ్చి ప్రచురించింది. దాని మూలంగా దాన్ని పుస్తకంగా వేసే పబ్లిషర్ బుట్టలో పడ్డాడే తప్ప, మరో పబ్లిషర్ కానీ, పత్రికగానీ ఆయన్ని రచనలు అడగలేదు!"

"అలా ఎందుకు జరిగిందంటారు?" సునీల చివరకు ప్రశ్నించింది.

"అమ్మాయి చాలా బావుందని ఆమె తల్లిదండ్రులూ, మధ్యవర్తీ, చివరికి పెళ్ళిచేసే పురోహితుడూ యేక కంఠంతో మొత్తుకోవచ్చు. చేసుకునే వాడికి నచ్చాలిగా? నవల బావుందని సంపాదకుడు పాఠకుల్ని

బ్రెయిన్ వాష్ చేయొచ్చు. పాఠకులకి అలా అనిపించాలిగా?" రుద్రభట్ నవ్వుతూ మరో సిగరెట్ వెలిగించాడు.

"రుద్రభట్ గారూ.. ఇంతకీ నన్నేం చేయమంటారు?" అంతా అగమ్యగోచరంగా అనిపిస్తున్న సునీల అడిగింది.

"మీ వారు మీ మాటకి గౌరవం ఇస్తారని మాకు తెలుసు. మీతో అన్నదంతా నేను స్వయంగా ఆయనతో అంటే ఆయన అఫెండవుతారు. మీరే చెప్పండి, ధర్మంగా తనకి రావాల్సిన బహుమతి మొత్తాన్ని న్యాయంగా రాబట్టుకొమ్మనండి. తనకి న్యాయం చేసుకోలేని వ్యక్తి మరొకరికి, లోకానికి న్యాయంచేసే హీరోల్ని సృష్టిస్తూ రచనలు చేయడానికి అర్హుడు కాడని చెప్పండి!"

సునీల చిన్నగా నవ్వింది. "ఇవే అక్షరాలు కాకపోయినా, ఇదే అర్థాన్ని వ్యక్తంచేస్తూ అప్పట్లో నేనూ ఆయనతో ఇలాగే అన్నాను...."

"అందుకే మొదట మిమ్మల్ని కలుస్తున్నాను. ఆ పదివేలూ మగాడైన మీ ఆయనకి మరీ గొప్ప మొత్తం అనిపించకపోవచ్చు. గృహిణిగా డబ్బు విలువ మీకు తెలుసు. మా సంస్థ సహాయంతో దాన్ని వసూలు చేసుకోండి!" రుద్రభట్ ఆరితేరిన ఎల్ఐసీ ఏజెంట్ లా అన్నాడు.

సునీల సాలోచనగా తన ఎర్రటి గోళ్ళని కాసేపు చూసుకుంది. రెప్పలెత్తి రుద్రభట్టువైపు చూసింది. "మీరు చెప్పిందంతా నాకు బాగా నచ్చింది. కానీ ఆయనకి నచ్చుతుందో లేదో నాకు తెలీదు. ఆయనకి ఫోన్ చేస్తాను. ఆఫీసుకి సెలవుపెట్టి అరగంటలో రమ్మం

టాను. మీరూ నేనూ ఇద్దరం ఆయనతో చర్చిద్దాం...."

"గుడ్ ఐడియా!" రుద్రభట్టు నవ్వుతూ అన్నాడు. "మిసెస్ సునీలా, అప్పుడే చెప్పాను. మీరు రచయిత్రిగా బాగా రాణిస్తారు. ఆ 'కోనపల్లి కోకిల'ను చూడండి. ఎడా పెడా ఎలా రాసేస్తోందో!"

పైకి లేవబోతున్న సునీల మళ్ళా సోఫాలోకి వాలింది. "హుం! కోకిల కథలు ఎడా పెడా పబ్లిష్ అవుతున్నాయి. ఆమె రచనలు చదువుతూంటే, ఆమెకంటే నేనే బాగా రాయగలననిపిస్తుంది! పత్రికలు, ముఖ్యంగా ఆ వార పత్రిక ఆమె రచనల్ని పర్మనెంటుగా వేస్తోంది. ఎందుకా అని ఆలోచించాను. తరవాత.... తెలిసింది...."

"ఏమిటి?" రుద్రభట్టు ప్రశ్నించాడు.

సునీల కళ్ళతో నవ్వింది. "కోకిల.... ఆ పత్రిక ఎడిటరూ.... అయినా మనకెందుకులెండి...."

రుద్రభట్టు అర్థమైనట్టు నవ్వాడు. "ఆమె విజృంభించాక మీ ఆయన సీరియల్స్‌కి ఆ పత్రికలో అవకాశం లేకుండా పోయింది! అది కూడా మా సంస్థకి తెలుసు!"

"అలాగా!"

"ఇలాంటి దౌర్భాగ్యస్థితి మారాలి. దేశమంతా వున్న టాలెంట్ దేశానికంతికీ అందాలి. పేరుకోసం ఉచితంగా రచనలు సప్లై చేసే వాళ్ళవల్ల నిజమైన రచయితలు భూస్థాపితం అయిపోతున్నాడు. వ్యక్తిగతమైన లాభాల్ని ముఖ్యంగా చూసుకునే వ్యక్తుల పిడికిలినుండీ పత్రికలు విముక్తి చెందాలి! మీవారికి చెప్పండి. తనకి జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ 'భారసం'కి రాసివ్వమనండి!" రుద్రభట్టు ఉద్రేకంలో అన్నాడు.

"ఆయన్ని రమ్మంటాను. ఈలోగా మీకు టీ తెస్తాను" సునీల లేచి, వంటగదివేపు నడిచింది.

రుద్రభట్టు వెనక్కి వాలి సిగరెట్ వెలిగించాడు.

2

అతను మంచంమీద వెల్లకిలా పడుకున్నాడు. ఏవో ఆలోచనలు అతని బుర్రలో మోసులెత్తి, మెలికలై తీగలుగా సాగుతున్నాయి. పడుకునే సిగరెట్ వెలిగించి, సీలింగ్ వైపు రింగులా వదిలాడతను.

చిన్న చప్పుడుతో తలుపు తెరుచుకుంది. అతని ఆలోచనల తీగలన్నీ ఒక్కసారిగా తెగిపోయాయి. అతను పక్కకి తిరిగాడు.

ఆమె గుమ్మంలో నిలబడింది. లేతగులాబిరంగు గార్డెన్ సిల్కు చీర. అదే రంగు స్లీవ్ లెస్ జాకెట్. భుజాలమీద గమ్మత్తుగా కదులుతున్న బాబ్డ్ హెయిర్. పట్టుకుచ్చు లాంటి శిరోజాల ఫ్రేమ్ మధ్య అందంగా ఇరుక్కున్న కోల మొహం. మూసిన తలుపుకి జార్లాబడి ఆమె బరువుగా, పొడుగ్గా నిట్టూర్చింది. కెరటంలా కదులుతున్న గులాబిరంగు పైటని అతను చిరునవ్వుతో చూశాడు.

ఆమె మెల్లిగా కదిలింది. ఆమె నడకలో, మొహంలో అలసట స్పష్టంగా అవుపిస్తూంది. అలసట ఆమె అందాన్ని అద్భుతంగా హెచ్చు చేస్తోంది. అతని దగ్గరగా మంచంమీద చతికిలబడి ఆమె మళ్ళీ బరువుగా నిట్టూర్చింది.

"బరువు మోసినట్టు ఆపసోపాలు పడుతున్నావ్!" అన్నాడతను నవ్వుతూ.

"యూ కెన్ సీ ఇట్ ఎగైన్! ఇకనుంచీ యే పని మీద యెవర్ని కల్సుకోమన్నా సంతోషంగా వెళ్తాను.

అయితే ఇవాళ ఇంటర్వ్యూ చేయడానికి నన్ను పంపించిన 'జాతి దగ్గరకు మాత్రం వస్తే వెళ్ళను!" అందామె అతన్ని అదోలా చూస్తూ.

"ఏం?"

"నేన్నిక ఏ అపకారం చేశాను? ఎందుకీ శిక్ష విధించావ్?" ఆమె సీరియస్ గా అడిగింది.

"ఏం?"

"రాజకీయ నాయకుల్ని ఇంటర్వ్యూ చేస్తాను. జైళ్ళలో వున్న దొంగల్ని, ఖూనీకోర్లనీ ఇంటర్వ్యూ చేస్తాను. చివరికి, సైకియాట్రిస్టులనీ ఎత్తిసి రోగి పేషెంట్లనీ ఇంటర్వ్యూ చేస్తాను; అవసరమైతే! కానీ.... రచయితల్ని — బాబోయ్ — జన్మలో ఇంటర్వ్యూ చేయను!"

ఆమె మొహంలోని కంగారుని అతను నవ్వుతూ చూశాడు.

"ఏం?"

"ఆ అక్షరం తప్ప మరో ముక్క నీ నోటమ్మట రావడంలేదు! మహానుభావుడు చంపేశాడు! తన రచనల లిస్టు అడిగాడు. గుర్తులేదంటే తనే చెప్పించాడు; ఒక్కో పేరుని రెండేసి, మూడేసిసార్లు చెప్తూ. ఈ మధ్యే ప్రారంభించిన గేయాలు వినిపించాడు. రాస్తున్న నవలలో రెండున్నర ఛాప్టర్లు.... మై గాడ్.... నజ్జునజ్జు చేసేశాడు...."

"తరవాత?" అతను నవ్వుతూ అడిగాడు.

"ఇవాళంతా అక్కడే వుంటే ఎక్స్ క్లూజివ్ ఇంటర్వ్యూ ఇస్తానన్నాడు. భార్య పుట్టింటికెళ్ళిందట. ఇంటర్వ్యూకి అంతరాయం కలగదన్నాడు.... బాస్టర్డ్."

అతను పకపక నవ్వాడు. "ఇంతకీ...."

"ఇంతా చెప్పి, పబ్లిష్ అయిన రెండు నవలలు ఇచ్చాడు. మోసి మోసీ అలిసిపోయాను. అందుకే బరువు మోసినట్టు నీరసం అవుపించాను. అలసట యెక్కువయ్యేసరికి రోడ్లో అవుపించిన పీచుమిఠాయి బండి వాడికి ఇచ్చేశాను. పీచుమిఠాయి తిని చాలా యేళ్ళయింది!" ఆమె నవ్వుతూ ఆపింది.

"ఇంతకీ...."

వ్యానిటీ బ్యాగ్ లోంచి తీసిన ఒక కాగితాన్ని ఆమె అతని పక్కనే గిరాటేసింది. "ఎంతో ప్రయత్నించి, ఎన్నో పాట్లుపడి, గురుడికి బ్రెయిన్ వాష్ చేసి రాబట్టాను!"

"కంగ్రాట్స్!" కాగితాన్ని పరిశీలిస్తూ అతను అన్నాడు. "గుడ్ రిసీవర్ అందుకో. రసగుల్లా, మసాలా, స్ట్రాంగ్ టీ ఆర్డరిచ్చేయ్. అవన్నీ వచ్చేలోగా స్నానం చెయ్. తరవాత నవల డిక్టేట్ చేస్తాను. రాద్దువుగానీ...."

ఆమె కంగారుగా చూసింది. "నవలా? నువ్వా?"

"వై నాట్? నలుగైదుగురు రచయితల్ని ఇంటర్వ్యూ చేశాక, నాక్కూడా ఆ తీట పట్టుకుంది. రేపు స్వయంగా వెళ్ళి సంపాదకరావుగార్ని కల్సుకుంటాను. సీరియల్ గా వేయడానికి ఒప్పుకుంటారేమో కనుక్కుంటాను!"

3

తలుపు తోసుకుని అతను హాల్లోకి చూశాడు. రెండు వేపులా వరసలుగా వున్న టేబుల్స్ వెనక దాదాపు ఇరవైమందిదాకా కూచున్నారు. కొందరు రాస్తున్నారు; కొందరు చదువుతున్నారు. తలుపు దగ్గరగా నిలబడి

అతను అందర్నీ కలయజూశాడు. ఒక మూలగా అంగుళం పొడవు పెరిగిన గడ్డంతో రిమ్‌లెస్ కళ్ళద్దాల్లో వున్న వ్యక్తి కుర్చీ వెనక్కి నీలిగి తను రాసిందాన్నో, గీసిందాన్నో పెదాలు బిగించి చూస్తున్నాడు.

అతని ముందు స్టూలుమీద కూచున్న స్త్రీ కాగా ముందుకి వొంగి, అతని ముందున్న కాగితాన్ని చూడ్డానికి ప్రయత్నిస్తోంది. టేబుల్ మీదున్న సరంజామా అతన్ని ఆర్టిస్టుగా పరిచయం చేస్తున్నాయి. ఎదురుగా కూచున్నామె బొమ్మ వేస్తున్నాడా అతను?

నవ్వుకుంటూ అతను కదలబోయాడు. స్టూలుమీద కూచున్నామె పైకి లేచి, ఆర్టిస్టువైపు కదిలింది. అతని పక్కనే నిలబడి, ముందుకి వంగి డ్రాయింగ్ పేపర్ మీదున్న బొమ్మని పరిశీలనగా చూసింది.

"అంతా బావుంది. అయితే, ఈ సన్నివేశంలో, కథలో ఈ అమ్మాయికి పైటలేదు! పైటెందుకు వేశారు?" ఆమె ఆర్టిస్టుని ప్రశ్నించింది.

టేబుల్ మీదకి చేతులు ఆన్చి వొంగిన ఆమె పైట యెప్పుడో కిందికి జారింది. ఆర్టిస్టు పక్కవాటంగా ఆమెని చూస్తూ చూపులు తిప్పుకోడానికి యమ ప్రయత్నం చేస్తున్నాడు.

తలుపు దగ్గర నుంచున్న అతను పూర్తిగా వాళ్ళిద్దరి వైపూ తిరిగాడు.

"పైట అక్కర్లేదన్నట్టు నా ఇన్‌స్ట్రక్షన్స్‌లో సబ్ ఎడిటర్ రాయలేదు. మీరు కిరణ్‌ని అడగండి...."

ఆమె నిటారుగా నుంచుంది. జారిపోయిన పైటని గుర్తించి, విసుగ్గా సర్దుకుంది.

"లాస్టు వీక్ కూడా మీరు బొమ్మ సరిగ్గా వేయ

లేదు. ఈ నవల్లో హీరోయిన్ ధరించే దుస్తులమీద నేను యెంతో ఛేస్ చేశాను. ఆమె ధరించే దుస్తుల ఆధారంగా ఆమె తత్వాన్ని హీరోద్వారా అంచనా వేయించాను. ఎడిటర్ గారికి చెప్తాను. మొత్తం స్క్రిప్టు మీరోసారి చదవండి. ప్రస్తుతం ఆ పైటని చెరిపేయండి" అంటూ ఆమె జోరుగా వెనక్కి తిరిగి, ఎదురుగా వున్న ఎడిటర్ గదివేపు నడిచింది.

అతను కదిలాడు. ఆమె ఫోటోని తను అడపాదడపా చూశాడు. అయినా పేరు గుర్తు రావడంలేదు. ఆమె రచయిత్రి అనీ, ఆమె సీరియల్ ప్రస్తుతం పత్రిక పాఠకుల్ని వారం వారం ఉత్కంఠతలో ముంచెత్తేస్తోందనీ ఇందాకటి సీను చెప్తోంది.

ఇంతసేపూ ఆమెనే చూస్తున్న చాలా కళ్ళు ఇప్పుడు తనమీద పడినట్టు అతను గుర్తించాడు.

"ఏంటి గురూ, కోకిల కావు కావు కావుమంటోంది?" ఆర్టిస్టుకి దగ్గరగా కూచున్న టైపిస్టు తగ్గు స్వరంతో అడిగాడు నవ్వుతూ.

"పైట తీసేయమంటోంది...." వాలుక ఇవతలికి చాపి బ్రష్‌తో తంటాలుపడుతున్న ఆర్టిస్టు మెల్లిగా అన్నాడు.

"ఎవరిది? కొంపతీసి...."

ఆర్టిస్టు తలెత్తి టైపిస్టుని నవ్వుతూ చూశాడు. ఇద్దరూ చిన్నగా నవ్వుకుంటున్నారు.

కోకిల....యస్ కోనపల్లి కోకిల....ఆంధ్రదేశాన్ని ఉప్పెనలా చుట్టేసి పాఠకులను గంగవెర్రులెత్తిం చేస్తున్న రచయిత్రి! అతను 'ఎడిటర్' బోర్డున్న మూసిన గుమ్మం ముందుకి జరిగాడు.

"ఎవరు?" ఎడంవైపునుంచీ ఒక కంఠం విసుగ్గా ప్రశ్నించింది.

అతను తలతిప్పి చూశాడు. టేబుల్ వెనక కూచున్న యువకుడు విసుగ్గా చూస్తున్నాడు.

"ఎవరు?" అతను ఎదురు ప్రశ్న వేశాడు.

యువకుడు ఫుల్ సూట్‌లో వున్న వ్యక్తిని ఎగాదిగా చూశాడు.

"మీరు 'ఎవరు?' మీకు 'ఎవరు' కావాలి?" యువకుడు అక్షరాల్ని ఎగతాళిగా నొక్కాడు. అతని పక్కనే కూచున్న సబ్ ఎడిటర్లు చదువుతున్న కథల్ని మరిచిపోయి కిసుక్కున నవ్వారు.

సూటు వ్యక్తి అతని ముందుకి కదిలాడు. కళ్ళని కప్పిన నల్ల కళ్ళద్దాల్ని తీసేశాడు. రత్నాల్లాంటి కళ్ళతో యువకుణ్ని తీక్షణంగా చూశాడు.

"నువ్వెవరు? రిసెప్షనిస్టువా? సబ్ ఎడిటర్ అనుకున్నా...."

ఏకవచనం యువకుడి మొహానికి ఆగ్రహాన్ని పూసింది.

"వాట్ నాన్సెన్స్....అనుమతి లేకుండా లోపలికి వెళ్టానికి వీల్లేదు!"

"అనుమతి ఇచ్చే అధికారి ఎవరు?"

"జి కె!"

"అలాగా! ఇందాకా ఒక స్త్రీ నిన్ను పూర్తిగా నిర్లక్ష్యంచేస్తూ మహారాణీలా అంతఃపురంలోకి వెళ్ళింది! ఆమెకి కొమ్ములున్నాయా?"

యువకుడు ఉక్రోషంతో చూశాడు. "దటీస్ నన్నాఫ్ యువర్ బిజినెస్! ఇంతకీ మిమ్మల్ని లోపలికి ఎవరు రానిచ్చారు?"

అతను చేతిలోని ఫోల్డర్ని టేబుల్ మీద పెట్టాడు. రెండు చేతుల్నీ టేబుల్ మీద ఆన్చాడు. ముందుకు వంగి ఇంకా కూచునే వున్న యువకుడి మొహంలోకి తదేకంగా చూశాడు.

"నీ టేబుల్ మీదున్న దొంతర్లని చూస్తూంటే త్రిప్పి పంపే కథల్ని చదివినంత పంచేసే సబ్ ఎడిటర్వి అని అర్థమవుతోంది. గుమ్మం ముందు కాపలా వుండే గులామ్ పని కూడా చేస్తున్నావా? నన్ను ఆటకాయించాలంటే వెళ్ళి నీ ఎడిటర్ గుమ్మంముందు యూనిఫామ్లో నిలబడు!"

యువకుడు ఉక్కిరిబిక్కిరవుతూ చూశాడు. తోటి ఉద్యోగులంతా పనులు మానేసి తన ముందు జరిగే నాటకాన్ని చూస్తున్నారని అతను గ్రహించాడు.

"షటప్!" యువకుడు పైకిలేస్తూ గర్జించాడు. "రమణయ్య యెక్కడ చచ్చాడు?" పక్కకి తిరిగి అరిచాడు.

"ఓహ్! రమణయ్య పని నువ్వు చూస్తున్నావా? మిస్టర్ వెనకటికి చాకలి ఇంట్లో మూటలు మోసిన గాడిద కుక్క చేయాల్సిన పనిచేసి నడ్డి విరగ్గొట్టించుకున్న కథ గుర్తుందా?" అతను నవ్వుతూ అడిగాడు.

యువకుడు ఉక్కిరిబిక్కిరవుతూ గుడ్లురిమి చూసే ప్రయత్నం చేశాడు. అతను తేరుకునేలోగా నలుగురు సబ్ ఎడిటర్లు టేబుల్ దగ్గరకు చేరుకున్నారు.

"ఏమిటండీ గొడవ?" అద్దాలేసుకున్న సీనియర్ సబ్ ఎడిటర్ ప్రశ్నించాడు.

సూట్ వ్యక్తి అతన్ని చిరునవ్వులో చూశాడు. "గొడవా? ఏం లేదే! ఉందంటే మా మిత్రుడు

చెప్పాలి!"

"ఇంతకీ మీరెవరు? ఏం కావాలి?"

"ఎన్నిసార్లో చెప్పినా మీ కెవ్వరికీ అర్థం కాదు. ఇంక నాకు మీ గురువు—సంపాదకరావు కావాలి!"

"ఓహో....ఎడిటర్ గారా? ఆయన సంగీతరావుగారు."

"అతని పేరు యేదైనా నాకు అభ్యంతరంలేదు. అతను తక్షణం నన్ను చూడాలి!"

"ముందు మీరు ముందు గదిలో కూచోండి. ఎడిటర్ గారితో పనేమిటో చెప్పండి. ఆయనకి చెప్తాం. ఆయన అపాయింట్ మెంట్ ఇస్తే, చూడండి...."

"అనుకున్నప్పుడు, అనుకున్న వ్యక్తిని చూడ్డం నా అలవాటు. అపాయింట్ మెంటిచ్చేదాకా ఆగే అలవాటు నా రక్తంలో లేదు!" అతను నవ్వుతూ అన్నాడు.

"అది కుదరదు. మీ అలవాటు మార్చుకోవాలి. అదీగాక లోపల ఆయనతో యెవరో వున్నారు. ఒకరితో వుండగా మరొకర్ని ఆయన ఎంటర్ టైన్ చేయరు...." సీనియర్ సబ్ ఎడిటర్ హుందాగా చెప్పుకుపోతున్నాడు.

"ఓహో....గూటిలో కోకిల వున్నప్పుడు మరో పక్షి, మరో మానవుడు వెళ్ళగూడదా? చెప్పరేం?" అంటూ అతను ఫోల్డర్ అందుకుని ఎడిటర్ గది గుమ్మం వేపు తిరిగాడు. మూసిన గుమ్మంముందు ఆగి వెనక్కి తిరిగి, గుంపుగా నిలబడ్డ నలుగుర్నీ చిరునవ్వుతో చూశాడు.

"కాకి గూడులోకి ప్రవేశించిన కోకిల గుడ్డుపెట్టేదాకా తిరిగిరాదు! మనం చప్పుడుచేసి రప్పించాలి!" అంటూ అతను తలుపుమీద చేత్తో దబదబ బాదాడు.

నలుగురూ కంగారుగా మొహాలు చూసుకోడం అతనికి

నవ్వు తెప్పించింది. అతను చెయ్యి డోర్ హాండిల్ని పట్టుకుని నిర్లక్ష్యంగా తిప్పింది. తలుపుని బలంగా తోస్తూ అతను లోపలికి దూరాడు. తలుపుని వదిలేసి, స్తంభంలా నిలబడ్డాడు.

అఖిలాంధ్ర పాఠకుల్ని వారం వారం అదరగొట్టేస్తూ, అత్యధికంగా అమ్ముడై పోతున్న 'హారతి' పత్రిక సంపాదకుడు సంగీతరావు తన కుర్చీలో లేడు. తన టేబుల్ ముందున్న కుషన్డ్ కుర్చీలో మెత్తగా, వొత్తుగా వాలి కూచున్న కోకిల దగ్గరగా, టేబుల్కి ఆని నించున్నాడు. అంతసేపూ ఎటో తిరిగి వున్న వాళ్ళ తలలు గుమ్మం వైపు తిరిగి వున్నాయి. ఆమె మొహంలో కంగారూ, విసుగూ, అతని మొహంలో ఆగ్రహం వ్యక్తమవుతున్నాయి.

"హూ ఈజ్ దట్? గెటౌట్!" ఎడిటర్ సంగీతరావు గర్జించాడు.

అతను చిరునవ్వుతో సంగీతరావుని చూస్తూ వుండి పోయాడు. లావుగా, పొట్టిగా వున్న ఆకారం. గుండ్రటి మొహం. వెనక్కి అణగదువ్విన క్రాపుని మధ్యపాపిడి రెండుగా చీలుస్తోంది. అధికారం, గర్వం రెండూ అతని కళ్ళకి తగిలించిన అద్దాల్లా వున్నాయి.

"మీతో కొంచెం మాట్లాడాలి...." గుమ్మం దగ్గర్నుంచీ కదల్తూ అన్నాడతను.

"మొదట బైటికెళ్ళి, వెయిట్ చేయండి. విజిటింగ్ కార్డు పంపించండి. ఎప్పుడు లోపలికి రావొచ్చో తెలియజేయబడుతుంది. అప్పుడు రండి. ఆ 'కొంచెం' యేదో మాట్లాడండి!" సంగీతరావు విసుగ్గా, ఎగతాళిగా అన్నాడు.

అతను వాళ్ళిద్దరికీ దగ్గరగా ఆగాడు. నవ్వుతూ కోకిల

వేపు చూశాడు. చూపుల్ని సంగీతరావువైపు తిప్పాడు.

"విజిటింగ్ కార్డూ, అపాయింట్‌మెంటూ వగైరా గొడవలేం లేకుండా ఈవిడ లోపలికి వచ్చిందిగా?"

"నాన్‌సెన్స్! దటీజ్ నన్నాఫ్ యువర్ బిజినెస్! గెటౌట్!" సంగీతరావు అరిచాడు.

"ఐ థింగ్ ఎవ్విరి థింగ్ ఈజ్ మై బిజినెస్! సంగీతరావ్, నేను బైటికెళ్తే, త్వరలో నువ్వూ బైటికెళ్ళిపోతావ్; పర్మనెంట్‌గా!" అతను నవ్వుతూ అన్నాడు. సంగీతరావు ఆగ్రహాన్ని అణచుకుని మాట్లాడే లోగా మళ్ళీ అన్నాడు. "నీకు కొన్ని భయంకరమైన రహస్యాలు చెప్పడానికి పనిగట్టుకొచ్చాను. ఆ రహస్యాల్ని ఇతర్లువిని, అక్కడా ఇక్కడా కోకిల గానంచేస్తే నువ్వు సజీవంగా సమాధి ప్రవేశం చేస్తావ్. అంచేత.."

"గెటవ్!" సంగీతరావు హుంకరించాడు. బుస కొడుతూ తన కుర్చీవైపు నడిచి టేబుల్ కిందికి చేతిని చాపాడు.

"సంగీతరావ్, కాలింగ్ బెల్ నొక్కకు! ఇందాకా నన్ను ముందు హాల్లో ఆపడంలో విఫలమైన నీ శిష్యులు ఇక్కడ్నుంచీ నన్ను బైటికి పంపలేరు! ఆర్టిస్టు తన హీరోయిన్ పైటని లాగేయలేదంటూ నీకు చాడీ చెప్పడానికి వచ్చిన అశేషపాఠకుల అభిమాన రచయిత్రిని సాగనంపు. రాత్రికి ఆమెని ఎట్లాగా ఆమె గూడులో కల్సుకుంటావ్‌గా! అప్పుడు అంతా చెప్పుకోవచ్చు!"

"గెటవ్! యూ లూనటిక్ బాస్టర్డ్! ఐ విల్...."

"అతనెవరో ఎందుకు వచ్చాడో, ఏం కావాలో కనుక్కోండి ముందట!" అంతవరకూ మౌనంగా కూచున్న కోకిల అంది.

ఎడిటర్ సంగీతరావు యజమాని ఈల విన్న అల్సే షియన్‌లా మారిపోయాడు. ఆమెవైపు తృణగాలం చూసి, చూపుల్ని యెదురుగా నించున్న వ్యక్తి వేపు తిప్పాడు.

"ఆల్ రైట్ ... ఎవరున్నవ్వు? ఎందుకొచ్చావ్?"

అతను చిన్నగా నవ్వాడు. "అంతా వివరంగా, సీరియల్‌లా చెప్తాను. నీ రెండు చెవులు మాత్రమే విసాలి. అంచేత...." కోకిలవైపు చూస్తూ ఆగాడతను.

"నథింగ్ డూయింగ్! యూ విల్...."

"ఆవేశపడకు సంపాదకరావ్! తెలుగు వారపత్రిక సంపాదకుడివైన నువ్వు నోరు తెరిస్తే ఇగ్లీషు ముక్కలే దొర్లుకొస్తున్నాయ్. "ఫలానా రచయిత్రి అపూర్వ సృష్టి. త్వరలో 'ధారావాహిక సీరియల్'గా ప్రారంభం!" అంటూ పోయిన వారం ఫుల్ పేజీల్ అనౌన్సు చేయించిన నువ్వు ఇంగ్లీషు మాట్లాడుతూంటే నాకు ముచ్చెమటలు పోసేలా వున్నాయ్...."

"వాట్ నాన్సెన్స్...."

"ఆవేశపడకండి. ఆ విషయం నేను కూడా తరవాత మీకు గుర్తుచేశాను. 'ధారావాహికం' అంటే చాలని చెప్పాను.... నేను వెళ్తాను. అతని పనేమిటో చూడండి" కోకిల మెల్లిగా పైకి లేచింది. అలవాటు తప్పకుండా కిందికి జారిపోయిన పైటని కొంచెం అలస్యంగా అందుకుని గుమ్మంవైపు కదిలింది.

'రాత్రికి ఆమె గూటిలో కల్సుకుంటావుగా!' అన్న తన మాటని చక్కగా అర్థంచేసుకున్న కోకిల తెలివి తేటల్ని అతను చిరునవ్వుతో మెచ్చుకున్నాడు. చిన్న

చప్పుడుతో తలుపు మూసుకుంది.

"చెప్పు! ఎవరున్నావ్?" ఎడిటర్ సంగీతరావు కంఠం ఆగ్రహంతో, చిరాకుతో పదునెక్కింది.

గుమ్మం వైపు తిరిగిన అతను మెల్లిగా వెనక్కి తిరిగాడు. చిరునవ్వుతో అతన్ని చూస్తూ కోకిల ఖాళీచేసిన కుర్చీలో కూచున్నాడు. కోటు జేబులోంచి పాకెట్ తీసి సిగరెట్ వెలిగించాడు. పొగ ఊదుతూ సంగీతరావు మొహంలోకి తదేకంగా చూశాడు.

"సంగీతరావ్, అయామ్ శివరామ్...."

4

సంగీతరావు అతన్ని హీనంగా, ఎగతాళిగా చూశాడు. "ష్‌హ్.. ప్రింటయిన ప్రతీ కథా, ప్రతీ సీరియల్ భాగం అత్యద్భుతంగా వున్నాయంటూ నాగాలేకుండా మా పత్రికకి ఉత్తరాలు రాస్తున్న శివరామ్ నువ్వేనన్నమాట!"

శివరామ్ చిన్నగా నవ్వాడు. "ఆ మహత్తర కార్యం చేస్తోంది నేను కాదనీ, ఉత్తరాలు రాయడంలో ఎక్స్‌పర్టయిన నీ సబ్ ఎడిటర్ అనీ నీకు తెలుసు!"

సంగీతరావు గుడ్లురుముతూ చూశాడు. "అయితే నువ్వెవరు? హూ ది హెల్....?"

"హోల్డాన!" శివరాం అడ్డు తగుల్తూ వారించాడు. "నేను ఉత్తరాల రచయితని కాను. ఇన్వెస్టిగేటివ్ నవలల పేరుతో నాలుగేసి నెలలకొకటి చొప్పున నవలలు ప్రచురిస్తూ, ప్రతిసారి ఒక సరికొత్త ఇన్వెస్టిగేటివ్ రచయితని బలిమీదికి వదిలి పాఠకుల్ని నంజుకు తినేస్తున్న నువ్వు నేను రాసిన 'సరికొత్త ఇన్వెస్టిగేటివ్ నవలని సీరియల్ గా వేసుకుంటావేమో కనుక్కోడానికి వచ్చాను."

'అదా సంగతి' అన్నట్టు సంగీతరావు బుర్రని సాభిప్రాయంగా ఊగించాడు. "చాలా శ్రమ తీసుకున్నావ్. థైటికళ్ళు. సబ్ ఎడిటర్‌కి నీ రాత అందజేయ్. తగినన్ని స్టాంపులు పెట్టాననుకుంటాను. నువ్వు ఇంటికి చేరుకునే సరికి, పోస్ట్‌మన్ దాన్ని నీకు భద్రంగా అందిస్తాడు! నా...."

శివరాం పగలబడి నవ్వుతూ అతన్ని అటంకపరిచాడు. ముందుంచుకున్న ఫోల్డర్ని అతని ముందుకి గిరాటేశాడు. నవ్వాపి, అతన్ని ఎగతాళిగా చూశాడు. "సంగీతరావ్, అది పక్కా పరిశోధనాత్మక నవల. చదవడం ప్రారంభిస్తే, ఆపవ్! ఒక్క పేజీతో అది నిన్ను బంధించేసుంది. పాఠకుల్ని కట్టిపడవేసే అక్షరాల సంకెళ్ళ సమూహం అది! తీరిగ్గా చదువుతానంటే, రేపు కల్సుకుంటాను...."

"నాన్ సెన్స్!" సంగీతరావు గర్జించాడు.

"హోల్డాన్!" శివరాం అతనికన్నా బిగ్గరగా అరిచాడు. "నీ ముందు పడున్న ఇన్వెస్టిగేటివ్ రచన అక్షరాల — డైనమైట్. ఇర్వింగ్ వాలెస్, మెక్లీన్స్, హెరాల్డ్ రాబిన్స వగైరా అమెరికన్ రైటర్స్ తమ రచనల్ని ఏజెంట్స్ ద్వారా వేలంవేసి పబ్లిషర్స్‌కి ఇస్తారు. ఆ అలవాటు ఇంకా అభివృద్ధి చెందుతూనే వున్న మనదేశంలో లేకపోయినా కూడా, నా రచనని నేను వేలం వేయగలను! ఇతివృత్తం ఇదీ అంటూ చెప్పి, సినాప్సిస్ చదవగానే అరడజను ఆంధ్రా మ్యాగజీన్స పందాలేసుకుని కొనేస్తాయి. ముఖ్యంగా సంగతి తెలిసిన మరుక్షణం నీ శత్రు పత్రిక 'బాంధవి' అక్షరలక్షలిచ్చి నా రచనని తన్నుకుపోతుంది...."

"దెన్ గెటౌట్! సెల్ యువర్ మక్ టు బాంధవి!"

సంగీతరావు హుంకరించాడు.

శివరాం చిన్నగా నవ్వాడు. ముందుకి వంగి ఫోల్డర్ని తీసుకున్నాడు. మెల్లిగా లేచినిలబడ్డాడు. ఎగతాళిగా సంగీతరావుని చూశాడు.

“సంగీతరావ్, నేను ఆలాపిస్తున్న 'రాగం' ఏమిటో కనుక్కోడానికి నువ్వు ప్రయత్నించడంలేదు. ముఖ్యంగా తెలుగు వారపత్రిక సంపాదకుడైన నువ్వు పూర్తిగా ఇంగ్లీషులోనే మాట్లాడుతున్నావ్. ఇంగ్లీషు నవలల్ని చదివి,—నీ సంస్థద్వారా పాఠకులకి పరిచయంచేసి, నంబర్ వన్ రచయితలుగా, రచయిత్రులుగా అమాయకుల నెత్తిన రుద్దుతూ పబ్లిసిటీ ఇచ్చి తయారుచేసిన వాళ్ళ చేత ఇంగ్లీషు నవలల్ని తెలుగు భాషలో అందిస్తున్న నువ్వు సహజంగా ఇంగ్లీషులోనే మాట్లాడతావ్! ఆల్ రైట్..”

“నాన్ సెన్స్!” సంగీతరావు అరిచాడు.

“ఆవేశపడొద్దు. ఇందాకా నీ ముందు వాలి వసంత గానం సాగించిన కోకిల ప్రస్తుతం సీరియల్ గా అందిస్తున్న నవల ఆమె కడుపున పుట్టింది కాదనీ, ఇర్వింగ్ వాలెస్, హెన్రీడెంకర్, సిడ్నీ షెల్డన్—ఈ ముగ్గురి మూడు నవలల సారాంశం కలబోసి తయారుచేసిన సరికొత్త తెలుగు థ్రిల్లర్ అనీ నాకు తెలుసు! అదాలా వుంచుదాం.

“నా రచనని కన్నెత్తి చూడ్డానికి నిరాకరించావ్. వెళ్తాను. నీ పబ్లిషర్ లక్ష్మీకాంత్ ని కల్సుకుంటాను. సినాప్సిస్ వినిపిస్తాను. అంత గొప్ప రచనని చదవకుండా తిరగ్గొట్టిన నీమీద అతని ఆగ్రహం నీ ఆశలా పేట్రేగి పోతుంది. ఆ క్షణంలో నువ్వు అతని సముఖానికి పిలవబడతావ్. రచనని పూర్తిగా చదవకుండానే లక్ష్మీకాంత్

కొనేస్తాడు. ఎంత కావాలంటాడు. ధర చెప్తాను. పారితోషికంతోబాటు నిన్ను బర్తరఫ్ చేస్తూ జారీచేసే ఆర్డరు కాపీ కూడా కావాలంటాను....”

“గెట్....ఔట్ !”

శివరాం అతని కళ్ళల్లోకి ఎగతాళిగా చూశాడు. “నేను బైట అడుగుపెడితే తెల్లారేసరికి బ్యానర్ హెడ్ లైన్ వార్తయిపోతావ్ సంగీతరావ్!”

హుంకరించడానికి తెరిచిన సంగీతరావు నోరు మెల్లిగా మూసుకుంది. అతని మొహంమీద ఎర్రగా అవుపిస్తున్న ఆగ్రహంతో యేదో అనుమానం చేరింది. రెప్పవేయకుండా శివరాం కళ్ళల్లోకి తదేకంగా చూశాడతను.

“త్వరలో కుళ్ళుతూ కుప్పకూలిపోయే నిన్ను చూస్తూంటే నాకు ఇప్పుడే జాలేస్తోంది; సంగీతరావ్! నీకోసం, ఒక ముక్క చెప్తాను. రచయిత గంగాప్రసాద్ నీకు గుర్తున్నాడా? అతను నాకో స్టేట్‌మెంట్ రాసిచ్చాడు. నీ అధికారాన్ని, టెక్కుని క్షణకాలం మరిచిపోయి నా రచన సినాప్సిస్—సంక్షిప్త వివరణ—చదివితే నీకంతా అర్థమవుతుంది. తరవాత....”

సాలోచనగా కుర్చీలో కూచుంటున్న సంగీతరావుని చూస్తూ శివరాం ఆపేశాడు. గంగాప్రసాద్ పేరు అతని కనుచూపుల్ని దగ్గరగా లాగి ముడేస్తోంది.

“ఆల్ రైట్....నీ స్క్రిప్టు చదివే ఓపిక నాకు లేదు. సినాప్సిస్, సినాప్సిస్ అంటూ బొబ్బలెడుతున్నావ్. అదేమిటో చూస్తాను........” సంగీతరావు దర్పంగా అన్నాడు.

శివరాం నవ్వుతూ కుర్చీలో కూచున్నాడు. ఫోల్డర్

తెరిచి, ఒక దళసరి కాగితాన్ని తీసి అతని ముందుకి విసిరాడు. సంగీతరావు అప్రయత్నంగా అందుకుని, చదవడం ప్రారంభించాడు. అతని మొహాన్ని చదువుతూ శివరాం సిగరెట్ వెలిగించాడు.

సంగీతరావు తలని తొండలా కొంచెం పైకి లేపాడు. మెల్లిగా మళ్ళీ కిందికి వాల్చాడు. మూడుసార్లు తలని అలా పైకీ కిందికీ ఆడించి, పూర్తిగా పైకెత్తాడు. అతని కళ్ళు శివరాం మొహంలోకి అర్థంకానట్టు చూశాయి. అయోమయం, ఆందోళనా, ఆగ్రహం అతని రెండు కళ్ళనీ మూడు పొరల్లా ఆవరించుకున్నాయి.

"ఏమిటిది?" అప్రయత్నంగా అడిగాడతను.

సంగీతరావు కంఠస్వరంలో దూరిన మార్పుని శివరాం సంతృప్తితో గమనించాడు. పెదాల మధ్య వున్న సిగరెట్ని మెల్లిగా ఇవతలికి తీశాడు. నోటినిండుగా లాగిన పొగని గుండ్రటి, లావుపాటి చక్రంలా నిర్లక్ష్యంగా అతనివైపు రువ్వాడు. శిరచ్ఛేదం చేయడానికి దూసుకొస్తున్న విష్ణుచక్రంలా తనవేపు తేలివస్తున్న పొగచక్రం నుండి అసంకల్పితంగా తలని పక్కకి వాల్చాడు సంగీతరావు. తెల్లటి పళ్ళని చూపుతూ శివరాం చిరునవ్వు నవ్వాడు.

"అది నీ జీవితచరిత్ర సారాంశం, సంపాదకరావ్!"

శివరాం మాటలు తనకి వినిపించనట్టు సంగీతరావు అయోమయంగా చూశాడు. రెప్పలు తాటించడం మరిచిపోయిన అతని అనిమిష నేత్రాల్లోకి శివరాం చిలిపిగా చూశాడు.

"రచయితల జీవితచరిత్రలు మనదేశంలో కొల్లలుగా దొరుకుతాయి. సంపాదకుల జీవితచరిత్రలు బొత్తిగా

లేవు. సాహిత్యంలోని ఆ లోటు తీర్చడానికి ఈ శివరాం నీ జీవితచరిత్ర రాశాడు, సంగీతరావ్!"

"ఈ చెత్తంతా ఎక్కడ సంపాదించావ్?" తగ్గు స్వరంలో పలికిన సంగీతరావు కంఠం ఆశ్చర్యాన్నీ, ఆగ్రహాన్నీ ఇవతలికి చిమ్మింది.

శివరాం పకపక నవ్వాడు. "చెత్త! కరెక్ట్! ఈ చెత్తా, ఇంతా నేను పోగుచేసిన చెత్తా నిన్ను చిత్తు చిత్తు చేస్తాయి. అది కేవలం సినాప్సిస్ మాత్రమే. ఫుల్ లెంగ్త్ నవల నిన్ను పూర్తిగా ఆకట్టుకుంటుంది. అవి అక్షర—అయస్కాంతాలు. ప్రారంభిస్తే పూర్తిగా చదివేదాకా కన్నార్పలేవు. స్క్రిప్టుని కింద పెట్టలేవు. నీ ఇంగ్లీషులో చెప్పాలంటే నా రచన 'అన్ పుట్ డౌనబుల్!' అంచేత...."

సంగీతరావు చేతిలోంచి తనవైపు దూసుకొస్తున్న కాగితాన్ని చూస్తూ శివరాం ఆపేశాడు. రెప్పలెత్తి అతన్ని ఆశ్చర్యంగా చూశాడు! సంగీతరావు కటాలున పైకి లేచాడు. గుడ్లురుముతూ శివరాంని బెదిరింపుగా చూశాడు

"షేక్ దట్ రబ్బిష్ అండ్ గెట్ లాస్ట్!"

శివరాం మౌనంగా ఆ కాగితాన్ని తీసి ఫోల్డర్లో ఇరికించాడు. సిగరెట్ పీకని గదిమూలకి రువ్వి కొత్త సిగరెట్ వెలిగించాడు. కుర్చీలో వెనక్కి వాలి, సంగీతరావుని తదేకంగా చూశాడు.

"సంగీతరావ్, నా సినాప్సిస్ నీకు అర్థమైనట్టులేదు. ఎదటి మనిషి తెలివితనాన్ని నేను క్షమిస్తాను. అందుకే నీకు మరికొన్ని వివరాలిస్తాను...." శివరాం ఆగి, అతన్ని అర్థమైందా అన్నట్టు చూశాడు. అతను నోరు తెరిచే

లో గా, కంఠస్వరం పెంచి ప్రారంభించాడు:

"పదమూడేళ్ళుగా, ఆ ఎడిటర్ సింహాసనంలో తిష్ఠ వేసి, నువ్వు ఏకచ్ఛత్రాధిపత్యంగా 'హారతి' పత్రికని ఏలుకుంటున్నావు. ఈ పదమూడేళ్ళలో నీ మేధస్సు చాలామంది రచయితల్నీ, రచయిత్రుల్నీ తయారుచేసి పాఠకులమీదికి వదిలేసింది. వీళ్ళంతా తమని నీ శిష్య కోటిగా చెప్పుకుంటూ అచ్చులో పేరుచూసుకునే తీట వదిలించుకున్నారు.

తరవాత, సంక్రాంతి నవలల పోటీ, ఉగాది నవలల పోటీ, దీపావళి నవలల పోటీ, వినాయక చవితి నవలల పోటీ, పత్రిక జన్మదినం నవలల పోటీ వగైరా పేర్లతో యేడాదిలో అరడజను తక్కువ కాకుండా నవలల పోటీల్ని నిర్వహించావు. ప్రతిసారీ కొత్త కలాలకి బహుమతులు ప్రకటించావు. బ్రహ్మాండమైన పబ్లిసిటీ ఇస్తూ ఆ నవలల్ని సీరియల్స్‌గా ప్రచురించావు. కానీ, దురదృష్టమేమిటంటే. నువ్వు ఒక రచయితకు కూడా బహుమతి పైకం ఇవ్వలేదు...."

"నాన్ సెన్స్!" సంగీతరావు గర్జించాడు. "నీకు పిచ్చి పట్టింది! అకౌంట్స్ వింగ్‌లో చూస్తే తెలుస్తుంది. బహుమతి మొత్తాలు ముట్టినట్టు రచయితలూ, రచయిత్రులూ ఇచ్చిన స్టాంప్డ్ రసీదులు...."

"హోల్డాన్!" శివరాం నవ్వుతూ వారించాడు. "అందుకు సందేహం లేదనుకో! పాపం వాళ్ళు ఆ రసీదులు ఇచ్చారు - చెక్కులూ తీసుకున్నారు. అయితే, ఆ చెక్కుల మొత్తాన్ని రొక్కంగా, రహస్యంగా నీకు సమర్పించారు ఉదాహరణకి గంగాప్రసాద్ కేసుతీసుకో. అతని నవలకి ప్రథమ బహుమతి—పదివేలు—లభించింది.

చెక్కు ఇవ్వబడింది. చెక్కు జారీ అయ్యేముందే నువ్వు అన్ని సంప్రదింపులూ జరిపావు; రహస్యంగా. ఫలితంగా ఇవాళ రాత్రి అతను నీకు పదివేలు హార్డు క్యాష్ సమర్పించాడు; రేపు నీ ఆఫీసు పంపిన చెక్కు తీసుకున్నాడు.

ఇలాగే ద్వితీయ బహుమతి మొత్తం ఆరువేలూ, తృతీయ బహుమతి మొత్తం నాలుగూ—అంతా కలిపి ఒక్కో పోటీకి ఇరవై వేలు నువ్వు స్వాహా చేశావు. ఒక్కో ఏడాదిలో ఐదుకి తక్కువ కాకుండా పోటీలు నిర్వహించావు. అంటే యేడాదిలో అయిదు ఇరవైలు-లక్షరూపాయలు ఈజీగా జేబులో వేసుకున్నావ్ ...."

"నో! ఇదంతా ...."

"నోరు మూసుకో, కాసేపు!" శివరాం గర్జించాడు. "తరవాత నీ సంపాదన—మాస్టర్ ప్లాన్‌లోని రెండో దశ: నువ్వు రికమెండ్ చేసే పబ్లిషర్‌కే సీరియల్ని నవలగా అమ్మాలని కండిషన్ పెట్టావు. ఎదురు కట్నం ఇచ్చి నవలల్ని అచ్చేయించుకుని, సాహితీచరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో తమ పేర్ని శాశ్వతం చేసుకోవాలన్న తపనతో ఈ రచయితలంతా నీ ప్లాన్‌కి బలి అయిపోడానికి గుడ్డిగా వొప్పేసుకున్నారు. ఉదాహరణకి నీ గంగాప్రసాద్‌నే తీసుకుందాం. అతని నవల సీరియల్‌గా పూర్తయ్యాక దాన్ని 'నవలానికేతన్' పబ్లిషర్‌కి అమ్మించావు. ప్రతిఫలంగా ఆ పబ్లిషర్ నుండీ, గంగాప్రసాద్‌కి వెళ్ళే రెమ్యూనరేషన్‌లో అరవై పర్సెంట్ కొట్టేశావ్!"

"నో! యూ ...."

"నోనోనో అంటూ నువ్వు గొంతు చించుకుంటూ వుంటానంటే నాకు అభ్యంతరంలేదు. ఈ సంగతి

ప్రారంభించగానే, 'నో' అనకుండా "ఇంకా?" 'తరవాత?' అంటూ ఉత్సాహంతో అడిగే నీ జాతి వ్యక్తులు చాలామంది వున్నారు. ముఖ్యంగా నీ గర్భశత్రువు, 'రంగవల్లి' వారపత్రిక సంపాదకుడు కూలపాణి...." శివరాం ఆగి, దమ్ములాగాడు. రంగులు మారుతున్న సంగీతరావు మొహాన్ని చిరునవ్వుతో చూస్తూ మళ్ళీ ప్రారంభించాడు.

"నేను తయారుచేసిన చిత్తు — అంచనా ప్రకారం యేడాదిలో లక్షాన్నరకి తక్కువ కాకుండా నువ్వు ఆర్జించావు. రెండువేలా రెండువందల నెలసరి జీతం, ఒక భార్యా నలుగురు పిల్లలూ వున్న నీకు జీతం మాత్రమే ఆదాయం కాదన్న సత్యాన్ని నీ బంగళా, నీ భార్య మోస్తున్న బంగారు సరుకూ, మూడు బ్యాంకుల్లో వున్న లాకర్సూ నిరూపిస్తున్నాయి. గంగాప్రసాద్, సుస్నేశ్వ్రరావు, రమణీకుమారి వగైరా రచయితలూ, రచయిత్రులూ నాకు రాసియిచ్చిన స్టేట్ మెంట్సూ ఈ కుంభకోణాన్ని నిరూపిస్తాయి. ముఖ్యంగా, నీ కాకిగూడులో కూచుని కూస్తూ, ఇంకా గుడ్లు పెట్టని కోకిల భర్త — త్వరలో ఆమెనుండీ విడాకులు తీసుకోబోతున్న కోకిల భర్త — రాసిచ్చిన స్టేట్ మెంట్ నీ నిజస్వరూపాన్ని లోకానికి చూపిస్తుంది!"

"ఇది అన్యాయం — కోకిలాదేవికి పారితోషికం ముట్టింది!" సంగీతరావు అప్రయత్నంగా అరిచాడు.

"నిస్సందేహంగా!" శివరాం నవ్వుతూ అన్నాడు. "ఆమె రచనకి పారితోషికంతో పాటు. నీ అర్జనలో వాటాగూడా ఆమెకి ముట్టుతూనే వుంది! నీకోసం నలుగురు పిల్లల్ని కని, నలభై యేళ్ళు నిండకుండానే

అమ్మమ్మలా అయిపోయిన నీ భార్యలో లోపించిన సౌందర్యాన్ని, ఉషాసునీ, ఉద్రేకాన్ని, ప్రేమనూ కోకిలలో చూసుకుంటున్న నువ్వు ఆమె నవలలూ, కథలూ, పాఠకులు అడగని ప్రశ్నలకి సమాధానాలూ, అందచందాలకి చిట్కాలూ, చివరికి వంటలూ—వార్పులూ— ప్రచురిస్తూనే వున్నావ్. పత్రిక సర్క్యులేషన్ ఆకాశంలో వున్నంతకాలం నీ పబ్లిషర్ నిన్ను యేమీ అనడు. కానీ, నేను ఈ సీరియల్ని వేరేపత్రికలకి, రంగవల్లి సంస్థ ప్రారంభించిన దినపత్రికకి అమ్మేస్తానంటే అతను కొంచెం ఆలోచిస్తాడనుకుంటాను...."

సంగీతరావు కళ్ళు తెరుచుకునే కలగంటున్న వ్యక్తిలా కదలకుండా, నోరు మెదపకుండా కూచున్నాడు. అతనిలో భయం, ఆశ్చర్యం సంకులసమరం సాగిస్తున్నాయని నుదురుమీద ప్రత్యక్షమైన చెమట బిందువులు స్పష్టం చేస్తున్నాయి. నిండుకుండలా తొణక్కుండా కూచున్న సంగీతరావుని శివరాం ఆశ్చర్యంతో చూశాడు. అతనికి డోస్ చాలలేదా?

"నిజం చెప్పు: నువ్వెవరు?" సంగీతరావు గొంతు పెక్కుంటున్నట్టు ప్రశ్నించాడు.

శివరాం అతన్ని నవ్వుతూ చూశాడు. తన ఆందోళనని బైటపడనీకుండా దాచుకోడంలో సంగీతరావు ఆరితేరినవాడిలా వున్నాడు. అతను చెమటలు కక్కకపోతే మరేం ఫర్వాలేదు; అతను కక్కాల్సింది వేరే వుంది!

"మరిచిపోయావా? అయాం శివరాం...."

"పేరు కాదు; వృత్తి...."

శివరాం చిన్నగా నవ్వాడు. "చెప్పినా కూడా, స్వా

వృత్తి యేమిటో నీకర్థంకాదు. నేను వచ్చిన పని చెప్తాను. దాన్నిబట్టి నా వృత్తి యేమిటో నువ్వు ఊహించుకో!"

"నువ్వొచ్చిన పనేమిటో నాకు తెలుసు!" సంగీతరావు అతన్ని తీక్షణంగా చూస్తూ అన్నాడు. "నువ్వు ఓడిపోయిన రచయితవని నేను ఊహించగలను. ఫస్ట్‌క్లాస్ రచనల్ని మాత్రమే ప్రచురించే నా పత్రిక 'హారతి' నీ రచనల్ని అంగీకరించినట్టులేదు. ఎలాగో దబాయించి నీ రచనల్ని అచ్చేయించాలనుకున్నావ్. పాఠకులకి నచ్చే కథలు రాయడం చేతకాని నువ్వు యేమిటేమిటో వాగుతూ, నన్ను బెదిరిస్తున్నావ్! వంటగదుల్లోకీ, పడకగదుల్లోకీ తొంగిచూస్తూ చెత్తంతా ఊహించుకుంటూ.."

శివరాం నవ్వు సంగీతరావు ఉపన్యాస కచ్చేరికి అడ్డు తగిలింది. శివరాం నవ్వు ఆపగానే సంగీతరావు అందుకున్నాడు.

"నన్ను బ్లాక్ మెయిల్ చేసే ప్రయత్నంచేసి, నీ నవలని పబ్లిష్ చేయించుకోవాలనుకుంటున్నావ్!"

శివరాం అతన్ని చిరునవ్వుతో చూశాడు. "సంగీతరావ్, బాగా ఊహించావ్. జోహార్లు! ఎంతైనా వార్తలు చదవకుండా ఊహించి, సంపాదకీయాలు రాసే చాకచక్యం వున్నవాడివి!"

"ఆల్ రైట్. ఇలాంటి దౌర్జన్యాన్ని నేను సపోర్టు చేయను. రచయితగా డెస్పరేట్ అయిపోయిన నిన్ను ప్రోత్సహిస్తాను. నీ నవలని ప్రచురిస్తాను. అయితే మరో నెలన్నర నువ్వు ఆగాలి. అయిదు సీరియల్స్‌కన్నా యెక్కువ వేయలేం...."

శివరాం ఘొల్లున నవ్వుతూ వుండిపోయాడు. సంగీతరావు అర్థం కానట్టు చూశాడు.

"ఇంటికి ఇద్దరు రచయితలూ, ఇద్దరు రచయిత్రులూ వున్న ఈ ఆంధ్ర దేశంలో శివరాం స్వయంగా చెయ్యి చేసుకుని రచనలు చేయాల్సిన అవసరంలేదు! పైగా నేను ఫిక్షన్ రాసే వ్యక్తిని కాను. నేను రాసేవన్నీ కఠిన సత్యాలు! నువ్వూ, నీ పాఠకులూ కఠిన సత్యాల్ని తట్టుకోలేరు!" శివరాం నవ్వుతూ సిగరెట్ పీకని గది మూలకి విసిరాడు. "సంగీతరావ్, కృతిమార్చు! కొత్త పాట పాడు!"

"ఓకే, శివరాం, నీ రచనకి తగిన పారితోషికం ముందే చెల్లించబడేలా చూస్తాను. మంచి పబ్లిషర్ ...."

"సంగీతరావ్, కృతేకాదు; రాగం, పాట కూడా మార్చు! ఈ ఫోల్డర్లో వున్న రచన ధారావాహిక నవల కాదు; అది నీ అశృధారావాహిక నవల! దాన్ని నువ్వు కొనుక్కోగలవ్. కానీ, ప్రచురించలేవు! కావాలంటే నీకు దాన్ని అమ్ముతాను. వద్దంటే వెళ్ళిపోతాను. అర డజను పత్రికలకి అన్ని భాషల్లో అమ్మేస్తాను! నువ్వు ఇవ్వలేని డబ్బు వాళ్ళిస్తారు. నువ్వు చేయలేని ప్రచురణ వాళ్ళు చేస్తారు. దాంతో నీ గతం బైటపడుతుంది. వర్తమానం సర్వనాశనం అవుతుంది. భవిష్యత్తు పూర్తిగా మాయం అయిపోతుంది. త్వరలో నీ యజమాని ప్రారంభిస్తున్న దినపత్రిక సంపాదకత్వం నీ చెయ్యి జారిపోతుంది. రాజకీయ నాయకుల్నీ, వ్యాపారుల్నీ బ్లాక్‌మెయిల్ చేసి మేడలు కట్టే, మేటలు వేసే సువర్ణావకాశం నీ చేతుల్లోంచీ జారిపోతుంది. తరవాత ...."

"స్టాప్!" సంగీతరావు బొంగురుగా అరిచాడు. "అందరికీ లేని తీట నీ కెందుకు? ఎవరో ఏదో ఇచ్చారంటే—అది ఆయా వ్యక్తులు తమ ఇష్టాలతో ఇచ్చు

ఉన్నారు. రచయితలుగా పరిచయం అయ్యారు. వాళ్ళ మానాన వాళ్ళు....”

“బతుకుతున్నారు; పాఠకులుగా; రాణించలేని రచయితలుగా! నీ పత్రిక పరిచయం చేశాక, వాళ్ళల్లో యెవరి రచనల్ని యే పత్రిక తరవాత సీరియల్ గా వేసే సాహసం చేసిందో చెప్పవో చూద్దాం!” శివరాం నవ్వుతూ అడ్డుతగిలాడు. “అయినా అదంతా నాకు అనవసరం. అది వాళ్ళ తీట! అయితే, పారితోషికం ఎగ్గొట్టి, చెత్త రచనల్ని బాగున్నాయంటూ ఆకాశానికెత్తి, పాఠకుల ప్రశ్నల్ని సబ్ ఎడిటర్స్ చేత రాయించి విరుద్ధభావాల్ని కల్పించి, నానా గలాభా చేసి, ఆ సీరియల్స్ ని పాఠకుల నెత్తిన రుద్దుతూ బ్రెయిన్ వాష్ చేసి, సర్క్యులేషన్ పెంచుకున్నావ్. బూతూ, వయొలెన్సూ, పరిశోధన పేరుతో చెత్తా, రాయించి పాఠకుల్ని డమ్మీలుగా, ఇచ్చింది మింగే పాపాయిలుగా తయారు చేశావ్! పాఠకుల్లో బలహీనతలు పుట్టించి వాళ్ళకీ, రచయితల బలహీనతల్ని ఆధారంగా చేసుకుని వాళ్ళకీ అన్యాయం చేశావ్ ....”

“ఎవడో యెవరికో చేసిన అన్యాయం గురించి అడగడానికి నువ్వెవరు? హూ ది హెల్ ఆర్ యూ?” సంగీతరావు హుంకరించాడు.

శివరాం అతని దొంగకళ్ళలోకి తదేకంగా చూశాడు. “సోదర మానవులకి జరిగిన అన్యాయాన్ని నాకు జరిగిన అన్యాయంగా భావించేవాణ్ని!”

“నాన్ సెన్స్!”

“ఎప్పుడు, ఎక్కడ, ఎవరికి అన్యాయం జరిగినా సమయం చూసి సమర్థవంతంగా ఎదిరించే సగటు మాన

వుణ్ని, సంగీతరావ్!" శివరాం కంఠం నగారాలా గంభీరంగా ధ్వనించింది.

"డోంట్ బోస్టు! యూ ఆరే డర్టీ బ్లాక్ మెయిలర్!" సంగీతరావు బూతులిట్టు లెవల్లో అరిచాడు.

శివరాం పకపక నవ్వాడు. "ఇప్పటికి నా వృత్తికి ఒక పేరు కనిపెట్టగలిగావ్! ఈ బ్లాక్ మెయిలర్ని కొనుగోలు చేయాలంటే నువ్వు కొంత సొమ్ము ఖర్చుచేయాల్సి వుంటుంది...."

"ఎంత? మొరుగు! గిరా చేస్తాను!" సంగీతరావు హుంకరించాడు.

"వెరీగుడ్. తొణక్కుండా కూచుంటే మెసేజ్ అర్థంకాలేదేమో అనుకున్నా!" శివరాం నవ్వుతూ అన్నాడు.

"ఎంత?" సంగీతరావు గర్జించాడు.

"నీ కష్టార్జితంలో నాకు వాటా అక్కర్లేదు. మనిషి చెమటని దోచుకునే వాణ్ని కాను నేను. ఎగ్గొట్టి బహుమతులూ, పుస్తకరూపంలో వచ్చే సందర్భాల్లో నువ్వు ప్రచురించిన సీరియల్స్ మీద గుంజుకున్న కమిషన్లూ, నా అంచనా ప్రకారం యేడాదికి లక్షన్నరో ఎంతో అన్నాను. అంకెల్లో భిన్నాలుంటే క్యాల్క్యులేట్ చేయడం నాకు ఇబ్బంది. అంచేత ఇద్దరికీ అనుకూలంగా రౌండేసి లక్ష అనుకుందాం...."

"యూ కాంట్...."

"షటప్!" శివరాం గద్దించాడు. "సో ఏడాదికి రెండులక్షల చొప్పున పదమూడేళ్ళకి ఇరవైఆరు లక్షలు. ఈ ఇరవైఆరూ నీకు తేరగా వచ్చిన సొమ్ము. దీనికి అపరాధం—రచయితల్ని మోసం చేశావుగా?—కొంత,

ప్లస్ కోకిల భర్తకి ద్రోహం చేసినందుకు ఇంకొంత మొత్తం.... సే.... ఫార్టీలాక్స్....”

“నో ఓకే....!” సంగీతరావు బిగ్గరగా అరిచేశాడు.

శివరాం అతన్ని నవ్వుతూ చూశాడు. “భారత రచయితల సంక్షేమసమాఖ్య తరఫున ఈ శివరాం రచయితల్నీ, రచయిత్రుల్నీ—నువ్వు టోపీ వేసిన వాళ్ళని-కల్సుకున్నాడు. నువ్వు పాఠకులకి బ్రెయిన్ వాష్ చేసినట్టే ఆ రచయితలకి బ్రెయిన్ వాష్ చేశాడు. వాళ్ళంతా సమాఖ్య సహాకారంతో కోర్టుకి వెళ్ళడానికూడా సిద్ధంగా వున్నారు. సమాఖ్య తరఫునా, దగాపడిన రచయితల తరఫునా ఈ శివరాం కోర్టులో లాయరుగా వ్యవహరిస్తాడు. నిన్ను పచ్చడికింద రుబ్బేస్తాడు! అది గుర్తుంచుకో!”

మొట్టమొదటిసారిగా సంగీతరావు ఉక్కిరిబిక్కిరవుతూ చూశాడు. ఏసీని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ అతని మొహాన్ని చెమట పూర్తిగా తడిపేస్తోంది.

“శి....వ....రా....ం....అంత.....లేదు.....” అసంకల్పితంగా వున్నాడతను.

శివరాం చిన్నగా నవ్వాడు. “ప్రస్తుతం నీ జేబులో లేకపోవచ్చు. బ్యాంకుల్లో, ఇంట్లో దాచుకున్నావ్ గా? వెంటనే బయల్దేరు. ఎక్కడెక్కడికి వెళ్తావో వెళ్ళు. సరిగ్గా రెండు గంటల్లో నిన్ను ఇక్కడే కల్సుకుంటాను. అన్నట్టు....ఇక్కడొద్దు. నీ జీవిత చరిత్ర ఫోటోకాపీలన్నీ మోసుకురాలేను. రెండుగంటలకి ఫోన్ చేస్తాను. ‘డాక్యుమెంట్స్ తయారుగా వున్నాయ్!’ అంటాను. ఆ డాక్యుమెంట్స్ ఎన్నో చెప్తాను. అది నిజంగా వాటి సంఖ్యకాదు. నా హోటల్ గది నంబరు. అక్కడికి

కోసుకుని, దూసుకురా. నాది నాకు ఇచ్చేయ్; నీది నువ్వు పట్టుకెళ్ళు!"

ఎండి, వణుకుతున్న పెదవుల్ని బలవంతాన కంట్రోల్ చేసుకుంటూ సంగీతరావు గుటకలు మింగాడు. "శివరాం పది..... టెన్..... ఇవ్వగలను.....ఇచ్చేస్తాను.....నన్ను మరిచిపో...."

శివరాం సాలోచనగా, కన్సిడర్ చేసేవాడిలా తల పంకిస్తూ చూశాడు. సంగీతరావు ఆశగా, ఆత్రంగా చూస్తున్నాడు.

"ఓకే ...సంగీతరావ్.....ఎదటి మనిషి ప్రాధేయ పడితే నా హృదయం కరిగిపోతుంది. ఆల్ రైట్ ....పది! పదిలక్షలు సూట్ కేస్ లో సర్ది రెండు గంటల్లో నీకిచ్చి వస్తాను. ఎందుకంటే, నీ జీవిత చరిత్ర కాపీలన్నింటినీ మోసే అవసరం వుండదు. ఆమాటకొస్తే, ఈ కాపీని ఇక్కడే, ఇప్పుడే చించేస్తాను!"

సంగీతరావు రెప్పలు టపటప కొట్టుకున్నాయి. నమ్మకం, అపనమ్మకం అతని రెండు కళ్ళల్లో దాగుడు మూతలాడుతున్నాయి. రెండు క్షణాల తర్వాత అతను అప్రయత్నంగా నోరు తెరిచాడు.

"అంటే ...అంటే....తతిమ్మా....కాపీలు "

శివరాం ఫకాఫకా నవ్వాడు. "హేట్సాఫ్! తెలివైన ఘటానివే! తతిమ్మా కాపీలు ఇతర్లకి అమ్ముతాను. పోటీపడతారు! ఒక్కో ఎడిటర్ కి ఒకొక్క కాపీ! అలా చేస్తే నాకు అరవై దాకా వస్తుంది! నువ్వేలాగా పదిని మించి ఇవ్వలేనన్నావుగా!"

"యూ బాస్టర్డ్! స్కౌండ్రల్! రాస్కెల్! బ్లాక్

మెయిలింగ్ బ్లాక్! యూ....యూ....సన్....ఆఫ్..."

"పటప్! యూ సన్నాఫ్ ఎ గన్....అయాం సారి యూ సన్నాఫ్ ఎ పెన్! కలం పట్టిన వీరసంపాదకుడివిగా!" శివరాం నవ్వుతూ అన్నాడు.

సంగీతరావు ఉక్కిరిబిక్కిరవుతూ చూశాడు. తటాలున శివరాం నవ్వు ఆపేశాడు. "సంగీతరావ్, నీవు ఇంకా తిక్కపడక్కర్లేదు. తనున్న నీతిని గర్వంతో నిర్లక్ష్యంచేసే మనిషిని నేను అసహ్యించుకుంటాను. అంచేత పథకం మార్చుకున్నా. హోటల్ అంబాసిడర్ అనెక్స్‌లో నలభై ఆరో గదిలో నేనుంటాను. సరిగ్గా రెండేరెండు గంటలు .నూటఇరవై నిమిషాలు చూస్తాను. నిర్ణయించిన పారితోషికంతో నువ్వు ఒంటరిగా ప్రత్యక్షం కావాలి. ఒంటరిగా రావడానికి భయంవేస్తే పోలీసుల్ని తోడు తెచ్చుకో! నాకేం అభ్యంతరం లేదు....తరవాత.. నలభై వున్నాయో లేదో చెక్ చేస్తాను. అంతదాకా నువ్వు రిసెప్షన్‌లో వేచివుంటావు. నలభై సరిగ్గా వుంటే, నిన్ను నా గదికి పంపమని రిసెప్షన్‌కి చెప్తాను. నువ్వు వస్తావ్. అక్షరాలుగా మారిన నీ బతుకుని భద్రంగా పట్టుకెళ్తావ్!"

"శి....వ....రా....ం...."

"కాదు కూడదంటూ నోరు తెరిస్తే. కదిలిపోతాను. తిన్నగా మరో టోకు వర్తకుడు—రంగవల్లి సంపాదకుడు వున్నాడుగా? అతన్ని కల్సుకుంటాను...." శివరాం ఆగి, మరో సిగరెట్ వెలిగించాడు.

సంగీతరావు రెండు చేతుల్తో మొహం తుడుచుకున్నాడు. ఉబ్బినట్టున్న మొహాన్ని శివరాం వైపు కొద్దిగా పైకెత్తాడు. ఉన్నట్టుండి వణకడం ప్రారంభించిన రెండు

చేతుల్ని వొళ్ళోకి దించుకున్నాడు.

"ఓకే... బాస్టర్డు నలభై ....పారేస్తాను. అన్ని కాపీలు ఇస్తానన్న గ్యారెంటీ ఏమిటి?"

శివరాం అతన్ని తమాషాగా చూశాడు. "చెట్టంత మనిషిని నేనుండగా నీకు గ్యారెంటీ దేనికి సంగీతరావ్!"

"డోంట్ జోక్! ఏమిటి గ్యారెంటీ?" సంగీతరావు ఉరిమాడు.

"నో గ్యారెంటీ!" శివరాం సాదాగా అన్నాడు. "నీ చరిత్ర నన్ను మొట్టమొదటిసారిగా రచయితగా మార్చింది. నా మొదటి రచనను అచ్చులో చూసుకోవాలని లేకపోయినా, కనీసం వ్రాతప్రతినైనా అడపా దడపా చదువుకోవాలన్న కోరిక ఇప్పుడిప్పుడే నాలో పుట్టుకొస్తోంది. ఒరిజినల్ దగ్గరుంచుకుని, జిరాక్స్ కాపీలన్నీ పూర్తిగా నీకే ఇచ్చేస్తాను. భవిష్యత్తులో నువ్వు మళ్ళీ విజృంభించి, ఆవేశంలో కంచె దాటితే దాన్ని తిరగేస్తాను. మరో నాలుగు పేజీలూ, ఒకటో, రెండో అఫిడవిట్లూ చేరుస్తాను. బోల్డన్ని కాపీలు తీసి, పైసా అడక్కుండా అందరికీ — అవసరమైన వ్యక్తులకీ — బహూకరిస్తాను. ఆ వ్యక్తుల్లో పోలీసుల్ని చేరుస్తాను!"

"నో! ఇది అన్యాయం! ఘోరం! దారుణం!" సంగీతరావు బొబ్బలెట్టాడు.

"సంగీతరావ్, మళ్ళీ కంచె దాటుతావా?" శివరాం సూటిగా చూస్తూ ప్రశ్నించాడు.

"....నీకు....వాగ్దానం చేస్తున్నా....దాటను! అన్నీ ఇచ్చెయ్!" సంగీతరావు వణికే కంఠంతో అన్నాడు.

శివరాం చిరునవ్వు నవ్వాడు. "ఇంకేం! నువ్వు కంచె దాటకపోతే, నేనూ మాటతప్పను! మొదట్నుంచీ

అంటున్నమాట ప్రకారం కాపీలు అన్నీ—అన్నీ—ఇచ్చేస్తాం. ఒరిజినల్ కట్టి పెట్టుకుంటాను...."

"నో.... నేనొప్పుకోను!"

శివరాం ఒక్క ఉదుటున కుర్చీలోంచి లేచాడు. ఫోల్డర్ని నిర్లక్ష్యంగా మూసి, చూపుల్ని సంగీతరావువైపు తిప్పాడు.

"సంగీతరావ్ శ్రోత కోరిన విధంగా పాడనంత కాలం నువ్వు రాణించలేవు! నా పేరాన్నీ నా రాకనీ, నన్నూ మరిచిపో. వెళ్తాను. నీ కోకిలను లోపలికి పంపిస్తాను. కమ్మగా కబుర్లాడుకో!" శివరాం గిరుక్కున గుమ్మంవైపు తిరిగి. జోరుగా కదిలాడు.

"ఆగు!" సంగీతరావు అరిచాడు. శివరాం ఆగి, తిరిగి చూశాడు.

"స్కౌండ్రల్, రా. కూచో. ఏం చేయాలో మళ్ళీ చెప్పు.. మరచిపోయాను...."

శివరాం నవ్వుతూ కూచున్నాడు. టేబుల్ మీదున్న కాలింగ్ బెల్ని నొక్కాడు. తలుపు తోసుకుని అదరా బాదరా లోపలికి వచ్చి, సంగీతరావువైపు భయభక్తులతో, ఆశ్చర్యంతో చూస్తున్న బంట్రోతుని చిరునవ్వుతో చూశాడు.

"నీ ఎడిటర్ గారికి ఎయిర్ కండిషన్డ్ గదిలో వడదెబ్బ తగిలింది. ఏసీలో తగిలే వడదెబ్బ చాలా ప్రమాదం. వెళ్ళి రెండు స్ట్రాంగ్ కాఫీ, వేడివేడిగా అఘమేఘాలమీద పట్రా!" అన్నాడు శివరాం.

బంట్రోతు అర్థంకానట్టు చూశాడు.

"పరుగెట్టు! పట్టుకురా! శివరాం గుడ్లురుముతూ ఆజ్ఞాపించాడు.

బంట్రోతు కంగారుగా పరుగెట్టాడు. శివరాం విగ్రహంలా కూచున్న సంగీతరావుని చిరునవ్వులో చూశాడు "అలిసిపోయాను. కాఫీ తాగి, ఏం చేయాలో మళ్ళీ చెప్తాను!"

5

హోటల్ ఉల్లాస్.

212 గదిముందు అతను నిలబడ్డాడు. గదిలో వున్న లత ఏం చేస్తూ వుంటుందో ఊహిస్తూ చిరునవ్వు నవ్వుకున్నాడు. సిగరెట్ పీకని కిందపడేసి, బూటుతో నొక్కేశాడు. అతని చెయ్యి డోర్ హాండిల్ని పట్టుకుంది. తనకోసం ఎదురుచూస్తూ, తన రాకని క్షణాల తేడాతో ఊహించి ఆమె గొళ్ళెం తీసేసి వుంటుంది. మూడొంతులు గొళ్ళెం పెట్టకుండానే ఉంచివుంటుంది. తనలాగే ఆమెకి ధైర్యం ఎక్కువ. లోకాన్ని చూసి ఆమె భయపడదు! భయం మనిషిని క్షేమంగా ఉంచుతుంది; అలాగే విజయానికి దూరంగా ఉంచుతుంది అని ఆమెకి తెలుసు....

తన ఆలోచనల్ని నిజంచేస్తూ లోపలికి కదిలిన తలుపుని పూర్తిగా తోస్తూ అతను గదిలోకి దూరాడు. తలుపు మూసి గొళ్ళెం పెట్టేశాడు. గదుల్లో సాగే కొన్ని నాటకాల్ని లోకం చూడకూడదు!

చేతిని కిందికి లాగుతున్న బరువుని ఓసారి తృప్తికరంగా చూసి, అతను లోపలగదివైపు కదిలాడు. తలుపు తోసుకుంటూ బెడ్‌రూంలోకి దూరాడు. తనని చూస్తూ ఆనందంతో ఆమె ఎందుకో కేక పెట్టలేదు. సూట్‌కేసుని టేబుల్ మీద పడేసి అతను మంచంవైపు చూశాడు. మంచంమీద ఆమె వెల్లకిలా పడుకుంది. లేత

ఆకుపచ్చరంగు చీరా జాకెట్. చేతుల్ని పక్కల్లో ఉంచుకుని, శాంతిమయంగా పడుకున్న ఆమె రూపం అతనికి క్లియో పాత్రా సినిమా చివర్లోని లిజ్ టేలర్ భంగిమని గుర్తుకు తెస్తోంది. అయితే ఆ సీన్‌లో లిజ్ టేలర్ — క్లియోపాత్ర మరణాన్ని అభినయించింది. ఇక్కడ ఆమె సజీవంగా ఉంది. నిద్ర నటిస్తోంది. ఉచ్ఛ్వాసనిశ్వాసాలతో క్రమంగా పైకిలేస్తున్న ఆమె పైట ఆ సంగతిని అతనికి చెప్తోంది.

అతను కదిలాడు. చప్పుడు కాకుండా, మెల్లిగా మంచంమీద కూచున్నాడు. కిందికి వొంగి బూట్లు విప్పేశాడు. మంచం కదలిక తెలీకుండా, ఆమెకి నిద్రాభంగం కలక్కుండా విశ్రాంతిగా పడుకోవాలనుకుంటూ వెనక్కి వాలే ప్రయత్నం చేశాడు.

లతాలున రెండు చేతులు తీగల్లా అతన్ని చుట్టుకున్నాయి. "హాయ్!" అందామె.

ఆమెమీద అడ్డంగా, వెల్లకిలా పడిన అతను తలతిప్పి ఆమె మొహంలోకి నవ్వుతూ చూశాడు.

"దొంగా! నిద్ర నటించావ్!" అన్నాడు నవ్వుతూ శివరాం.

"ఊ! నటించడం నీకే వొచ్చనుకున్నావా? చూడు ఎలా వోడించానో!" లత నవ్వుతూ అంది.

శివరాం పైకిలేచి, ఆమెవైపు తొద్దిగా తిరిగి కూచున్నాడు.

"డార్లింగ్ ...."

"యస్?"

"చెప్పు!"

"ఏముందికి నువ్వూ నేనూ సేకరించిన ఇన్‌ఫర్మే

షన్‌తో కలిపిన సంగీతరావు జీవితచరిత్రని సంగీతరావుకే అమ్మేశాను....”

“ఎంతకో?”

“ఎంతో ఎక్కువిది. ఎక్కువడిగితే యిక్కట్లతో చస్తాడని భయమేసింది. ఓ నలభై చాలనుకున్నాను....”

“ఏలా?”

శివరాం ఆమెని నవ్వుతూ చూశాడు. “హనీ, వందలూ వేలూ మరిచిపో. రూపాయి విలువ సంగీతరావు సెలెక్ట్ చేసి ప్రచురిస్తున్న కథల, నవలల స్టాండర్డులా దారుణంగా పడిపోయింది! మనం ‘వ’కారం ఉపయోగించం. ఎప్పుడూ ‘అ’కారమే!”

“గుడ్ గాడ్....నలభై లక్షలు! కక్కేశాడా?”

“బ్రాండీ, విస్కీ, బీరూ అన్నీ కలబోసి తాగిన వాడిలా కక్కేశాడు!”

“అంత సులభంగా కక్కేశాడా?”

“సులభంగా ఎవడూ కక్కలేడు. కళ్ళల్లో నీళ్ళు; గొంతులో మంట, కడుపులో రంగులరాట్నం, చెవుల్లో హోరు....ఇలాంటివన్నీ అనుభవిస్తూ కక్కాడు. సంగీతరావూ అలాగే కక్కేశాడు....”

“డార్లింగ్....”

“వ్వాట్!”

“అతను....సంగీతరావో, సింగీతరావో-ప్రతీకారం...”

శివరాం నవ్వు ఆమెని అడ్డుకుంది.

“ప్రతీ-కారాలూ, మిరియాలూ నూరే స్టేజిలో అతను లేడు! జరిగిన నిర్వ్యాకం గురించి భార్యకు,—చివరికి లోకులకి కూడా చెప్పుకోలేడతను!”

“డార్లింగ్.....స్టేట్‌మెంట్ ఇచ్చిన రచయితలకి

పారితోషికం అందేలా చూస్తున్నావుగా!"

"చూసేశాంగా!" శివరాం నవ్వుతూ అన్నాడు. "స్టేట్‌మెంట్స్ ఇచ్చినప్పుడే వాళ్ళకి చేతినుండీ పే చేసేశాను. అయితే అందరికీ కాదు. వాళ్ళ నవలల్ని అలా, అలా తిరగేశాను. సత్తా ఉన్నవాళ్ళకి, ఏడుగురికి మాత్రం ఇచ్చేశాను. తతిమ్మా వాళ్ళ కలంకారీతనం దండగ. ఆ చెత్తనంతా ఓపిగ్గా చదివిన కంపోజిటర్స్‌కీ, ప్రూఫ్ రీడర్స్‌కీ, పాఠకులకీ ఇవ్వాలి నిజంగా! అయితే వాళ్ళెవరో మనం కనిపెట్టలేం. అంచేత మనకి యాభై వేల దాకా ఖర్చయింది. తతిమ్మా పైకం మన నికరాదాయం!"

లత అతన్ని పెద్ద పెద్ద కళ్ళతో చూసింది. "డార్లింగ్ ... ముందే సంగీతరావునుండీ గుంజకముందే ఇచ్చావ్? ఇక్కడ కథ అడ్డం తిరిగివుంటే ....?"

శివరాం రెండు చేతుల్తో ఆమె బాబ్డ్ హెయిర్ని సవరిస్తూ బుగ్గల్ని అదిమాడు. "మనం కన్న కథ ఎప్పుడూ అడ్డం తిరగదుగా! ఫలానా వ్యక్తి మనకి ఇవ్వాలని మనం నిర్ణయిస్తే, ఆ ఫలానా వ్యక్తి నిజంగానే ఇస్తాడుగా!"

బుగ్గల్ని నొక్కుతున్న శివరాం చేతుల్ని లత తన చేతుల్తో అదిమింది. "డార్లింగ్ ....పదిహేనురోజులుగా ఈ ఊళ్ళో బోర్ కొట్టేసింది!"

"అయితే పైకి లేయ్! నేను సిగరెట్ ముట్టిస్తాను. ఈలోగా డిటెక్టివ్ టెంపో నంబరు డయల్ చేయి. శివరాంగారు మాట్లాడతారని చెప్పు. రిసీవర్ నా చేతికి తగిలించు. సంభాషణ ముగించేలోగా మరో చీర కట్టి సింగారించుకో! వెంటనే బయల్దేరదాం!"

సిగరెట్ వెలిగిస్తున్న శివరాంని అలా క్షణకాలం చూస్తూ ఉండిపోయింది. సీలింగ్ వైపు పొగ రింగ్ ఊది, శివరాం ఆమెని నవ్వుతూ చూశాడు.

"డార్లింగ్ ...., టెంపోని వదిలేయ్...." అందామె మెల్లిగా.

శివరాం పకపక నవ్వాడు. "ఇంకా పట్టుకోలేదుగా!"

['శివరామ్ అడ్వెంచర్స్' సీరిస్‌లో ఇది 8 వ నవల]

—: ఐపోయింది :—